
# ముఖ్యమైన సందేశాలు-I

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# ముఖ్యమైన సందేశాలు-1



**రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,**

మొదటి ముద్రణ : జూలై, 2026
ప్రతులు : 1,000

**వెల : రూ. 80/-**

**పుస్తకముల కొరకు :-**
**తటవర్తి వీరరాఘవరావు,**
**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**
**సెల్ : 94901 71853, 9440309812**

# తోటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు- రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు -రూ.90/-
23) ముఖ్యమైన సందేశాలు-1 -రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 -రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
30) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
31) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
32) జ్ఞాన జ్యోతి - రూ.70/-
33) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
34) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
35) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
36) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
37) బుద్ధుని సందేశాలు - రూ.70/-
38) భూతదయే దైవత్వం - రూ.70/-
39) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
40) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
41) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
42) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
43) మానవునిలోని చెడు -రూ.70/-
44) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
45) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
46) మోక్షం అంటే? - రూ.70/-
47) కబీరు సందేశాలు-1 -రూ.70/-
48) మనసు-1 - రూ.70/-
49) మనసు-2 - రూ.70/-
50) కబీరు సందేశాలు-2 - రూ.60/-
51) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
52) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
53) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
54) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
55) అతీంద్రియ శక్తులు - రూ.60/-
56) ఆలోచించండి - రూ.60/-
57) నిర్వాణ మార్గం - రూ.60/-
58) ధ్యానులకు సూచనలు - రూ.60/-
59) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
60) మమకారం - రూ.60/-
61) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
62) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
63) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
64) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
65) సంకల్పమంటే? - రూ.50/-
66) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
67) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
68) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
69) అరిహంత్ - రూ.50/-
70) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన- రూ.50/-
71) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
72) విదురుని సందేశాలు - రూ.40/-
73) మూడురకాల జీవితాలు - రూ.40/-
74) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
75) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
76) బ్రహ్మం అంటే? - రూ.40/-
77) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం- రూ.40/-
78) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
79) మహాత్ముల సందేశాలు - రూ.40/-
80) సత్యం - రూ.40/-
81) చక్రాలు - రూ.40/-
82) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
83) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
84) మౌన ధ్యానం - రూ.40/-
85) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
86) శాకాహారమే మానవాహారం - రూ.15/-
87) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

# "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి"

మనం ముఖ్యమైన సందేశాలు చెప్పుకుంటున్నాం. మర్చిపోకూడని, అనుక్షణం గుర్తుంచుకోవాల్సిన విషయాలు ఇవి. ఈ విషయాలను మీరు ఎప్పుడూ గుర్తుంచుకుంటే, మీ జీవితంలో ఎంతో మార్పు వస్తుంది. మీరు తప్పులు చేయరు, ఏం జరిగినా దుఃఖించరు. సాధించలేనివి కూడా సాధిస్తారు, ఊహించని మార్పులు మీలో వస్తాయి, అటువంటి విషయాలను మనం చెప్పుకుంటున్నాం. పత్రి గారు ఎన్నో చెప్పారు, పెద్దలు కూడా ఎన్నో చెప్పారు. వాటి నుంచి నేను  చెబుతున్నాను.

అందుచేత, వీటిని మామూలుగా విని వదిలేయకండి, వాటిని తెలుసుకోవడం, ఆచరించడం చాలా అవసరం. ఈరోజు సందేశం ఏమిటంటే?

**"ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి"**

సహజంగా లోకంలో ఎవరిని చూసినా అంటే 99% మందికి వారి మీద వారికి నమ్మకం ఉండదు. ఎక్కువ మంది దేవుడి మీద ఆధారపడతారు. ఏ కష్టం వచ్చినా, ఏ బాధ వచ్చినా, ఏ సమస్య వచ్చినా వెంటనే దైవాన్ని ఆశ్రయిస్తారు. అది కూడా వారి వారి నమ్మకాలను బట్టే ఉంటుంది. హిందువులు వారి నమ్మకాన్ని బట్టి వారికి నచ్చిన దేవుణ్ని ఆశ్రయిస్తారు, క్రిస్టియన్లు వారి నమ్మకాన్ని బట్టి జీసస్‌ను ఆశ్రయిస్తారు, ముస్లింలు వారి నమ్మకాన్ని బట్టి అల్లాను ఆశ్రయిస్తారు. హిందువులు పూజిస్తారు, క్రిస్టియన్లు ప్రార్థిస్తారు, ముస్లింలు నమాజ్ చేస్తారు.

అలా హిందువులు పూజిస్తూ తమను కాపాడమని, రక్షించమని, ఉద్ధరించమని వేడుకుంటారు. "నువ్వే మాకు దిక్కు, ఆపదలో రక్షించే వాడివి నువ్వే" అని ప్రార్థిస్తారు. "నన్ను అనాథను కాకుండా చూడు" అని ఎన్నో విధాలుగా అర్థిస్తారు. ఆ దేవుడికి వారు అనుకున్న విధంగా ఏదో ఒకటి సమర్పిస్తూ ఉంటారు. ఇది యుగాల నుంచి ఆచారంగా వస్తూనే ఉంది లేకపోతే

ఒక్కొక్కరు వారి నమ్మకాన్ని బట్టి, ఒక్కో గురువుని ఆశ్రయిస్తారు. ఆ గురువే ఆదుకుంటాడు, రక్షిస్తాడు అని అనుకుంటారు.

ఈ ధ్యానమార్గంలోకి వచ్చిన వాళ్ళలో కూడా చాలామంది ఉద్దేశం ఏమిటంటే పత్రి గారు ఇప్పుడు భూమిపై లేకపోయినా, ఆయన మనల్ని చూసుకుంటూ ఉంటాడు అని భావించి భారం ఆయన మీద వేస్తున్నారు.

కానీ పత్రిగారు మాత్రం స్పష్టంగా చెప్పారు ''ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి" అని. ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా, పత్రి గారు ఎన్నో సార్లు వివరించారు. ఆయన "నేను కూడా మిమ్మల్ని ఉద్ధరించలేను, మీరు నాకు షేక్ హ్యాండ్ ఇచ్చినా, నన్ను స్పర్శించినా మీకు ఎలాంటి ప్రయోజనం లేదు. మీ తృప్తి కోసం మీరు చేస్తున్నారు" అని ఆయన ఎన్నో సార్లు చెప్పారు.

గౌతమ బుద్ధుని ప్రియ శిష్యుడు అయిన ఆనందుడు అనుకునే వాడు ఎప్పుడో ఒకప్పుడు నాకు బుద్ధుడు ఏదో ఒక సందేశం ఇస్తారు అని ఆనందుడు అనుకునేవాడు.

కానీ బుద్ధుడు ఎప్పుడూ ఆయన పనులు చేయించుకోవడమే కానీ, ప్రత్యేకంగా ఏ సందేశం చెప్పలేదట. ఆఖరికి, ఆయన చివరి గడియలు వచ్చినప్పుడు బుద్ధుడు ఆనందుడిని పిలిచి "ఆనందా! నీకు ఒక విషయం చెప్పాలి రా!" అన్నాడు. అప్పుడు ఆనందుడు ఎంతో సంబరపడ్డాడు. "ఆహా! నా జన్మ ధన్యమైంది, ఇప్పటికైనా ఆయన కరుణించాడు" అని ఎంతో సంతోషపడ్డాడు. ఈ చివరి క్షణంలో అయినా ఆయన నాకు బోధిస్తారని అనుకుని, ఎంతో ఆసక్తిగా, వినయంగా ఆయన దగ్గర కూర్చున్నాడు.

అప్పుడు బుద్ధుడు తన ఆఖరి పలుకులుగా, ఆనందా, నేను ఇచ్చే సందేశం విను అని "అప్పో దీపో భవ" అని చెప్పాడట.

ఆయన చెప్పిన "అప్పో దీపో భవ" అంటే నీ ఆత్మ దీపాన్ని నువ్వే

వెలిగించుకోవాలి, అంటే నీ ఆత్మను నువ్వే ఉద్ధరించుకోవాలి, ఇంకెవ్వరూ నిన్ను ఉద్ధరించలేరు అని అర్థం.

అప్పుడు ఆనందుడికి నీ ఆత్మను ఉన్నత స్థితికి నువ్వే చేర్చుకోవాలి, నీ ఆత్మను ఉన్నత లోకాలకి నువ్వే చేర్చుకోవాలి, నీ ఆత్మకు కావలసిన మోక్షాన్ని నువ్వే సంపాదించుకోవాలి, నీ ఆత్మ లక్ష్యాన్ని నువ్వే సాధించాలి అని బుద్ధుడు చెప్పిన సందేశం అర్థం అయ్యింది.

అలా చెప్పి ఆయన శరీరాన్ని వదిలిపెట్టారు. ఆ తర్వాత ఆనందుడు, ఆయన చెప్పిన సందేశం యొక్క అర్థాన్ని గ్రహించి, తీవ్ర సాధన చేయడం ప్రారంభించాడట. ఆనందుడు చాలా తక్కువ కాలంలోనే జ్ఞానం పొంది తన లక్ష్యాన్ని సాధించాడట. అప్పటి వరకు “ఆయన ఆశీర్వదిస్తారు, ఆయన చూసుకుంటారు” అని అనుకునేవాడట. కానీ చివరికి తన సాధనతో తానే సాధించాడట.

భగవద్గీత లో శ్రీకృష్ణులవారు బోధించిన అద్భుతమైన సందేశం ఏమిటంటే?

**శ్లో॥ ఉద్ధరేదాత్మ నాత్మానం నాత్మాన మవసాదయేత్**
**అత్మైవ హ్యాత్మనో బంధు రాత్మమైవ రిపురాత్మనః (భ.గీ. 6-5)**

తా:- ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. అంతేకానీ హీనమైన పనులు చేసి ఆత్మను కించపరచకూడదు. అలా కించ పరిస్తే ఆ ఆత్మే శత్రువై తనకు అపకారం చేస్తుంది. అలా కాక ఆత్మను ఉన్నతమైనదిగా భావించి కించ పరచకపోతే ఆ ఆత్మే మిత్రుడై తనకు ఉపకారం చేస్తుంది.

ఇది అర్థం కాక ఆ దేవుడిని, ఈ దేవుడిని, ఆ గురువుని, ఈ గురువుని ఆశ్రయించి ఆయనే నన్ను గట్టెక్కిస్తాడు, నా కష్టాల నుంచి బయట పడేస్తాడు, నా సమస్యలను పరిష్కరిస్తాడు అని అనుకుంటే వారికంటే మూర్ఖులు ఎవ్వరూ ఉండరు అని గుర్తుపెట్టుకోవాలి.

ఎందుచేతనంటే మీ సమస్యలకు మీరే కారణం, అలాగే వాటి నుంచి మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి.

అందుకే మేడం కాని, నేను కాని పత్రి గారికి ఎంత సన్నిహితంగా ఉన్నా, ఆయన ఎన్నో సార్లు భీమవరం వచ్చినా, మేము ఆధ్యాత్మిక విషయాలే మాట్లాడేవారం కాని, ప్రాపంచిక సమస్యలు గానీ, కుటుంబ సమస్యలు గానీ, ఆర్థిక సలహాలు గానీ ఏవీ అడగలేదు, ఆయన కూడా చెప్పేవారు కాదు.

ప్రారంభంలో మాత్రం, ఆయన మొదటిసారి భీమవరం వచ్చినప్పుడు ఒక్కటే అడిగాను. "నేను ఈ మార్గంలోకి వస్తే నా పిల్లలు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోగలరా?" అని అడిగాను.

అప్పుడు ఆయన "ఏమి ఇబ్బంది లేదు" అన్నారు. అంతే, వెంటనే వాళ్ళకు ఆస్తులు వాటాలు వేసి, "ఇక మీ పనులు మీరు చూసుకోండి, నాకు సంబంధం లేదు" అని చెప్పాను. వాళ్ళు కూడా చాలా సంతోషించారు, అన్ని వాళ్ళమీద వదిలేయడం వల్ల నాకంటే బాధ్యతగా చూసుకున్నారు. అందుచేత వాళ్ళ ప్రస్తావన మాకు లేదు. వారు దేహ దృష్టిలో ధన సంపాదనలో ఉన్నారు, మేమిద్దరం "ఆత్మ" దృష్టిలో జ్ఞాన సంపాదనలో ఉన్నాం.

అలాగే 'ఆత్మే' భగవంతుడు అని తెలుసుకున్నాం. అంతేకాదు, "నేను ఆత్మను" అన్న విషయం కూడా తెలుసుకున్నాం. మరి నేను ఆత్మ అయితే నేనే భగవంతుడిని అంటే "అహం బ్రహ్మాస్మి" అన్న వేదవాక్కు కూడా అర్థం చేసుకున్నాం. ఇంకా "ఆత్మే పరబ్రహ్మ" అయినప్పుడు నేనే "పర బ్రహ్మను" అన్న విషయం కూడా స్పష్టంగా అవగాహన చేసుకున్నాం.

మరి అంత గొప్పవాడినైన నన్ను ఎవరు ఉద్ధరించగలరు? అందుచేత నన్ను నేనే ఉద్ధరించుకోవాలి అని అర్థం చేసుకున్నాను. అంతేకాదు అందరూ ఆత్మలే కాబట్టి ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి అని పత్రిజీ చెప్పిన సందేశం అర్థం అయ్యింది.

అందుచేత కొంచెం ఆలోచించండి? మీ కంటే ఎవరైనా గొప్ప వారు ఉంటే, వారిని ఆశ్రయిస్తే వారు మిమ్మల్ని ఉద్ధరించగలరు. కానీ మీకంటే గొప్పవాడు ఎవరూ లేనప్పుడు, మిమ్మల్ని ఎవరు ఉద్ధరించగలరు? అన్న విషయం గుర్తుపెట్టుకోండి, అప్పుడు మిమ్మల్ని మీరు మాత్రమే ఉద్ధరించుకోగలరు అని తెలుసుకుని, మీ కృషి ద్వారా మిమ్మల్ని మీరే ఉద్దరించు కుంటారు అని అర్థం చేసుకోండి.

ఇది అర్థం కాక, ఎవరినైనా ప్రార్థించినా, వేడుకున్నా, పూజించినా, నమాజ్ చేసినా అది వృథా ప్రయాస తప్ప మరేం కాదు. చాలామందికి ఇది అర్థం కాదు "నన్ను నేను ఉద్ధరించుకోవడం ఏమిటి?" అని అనుకుంటారు. కాని నిన్ను నువ్వు ఉద్ధరించుకోకపోతే, నిన్ను ఉద్ధరించేవాడు ఇంకెవ్వరూ లేరు అని స్పష్టంగా తెలుసుకోవాలి.

చిన్న ఉదాహరణ, ఒక రాష్ట్రంలో డిజీపీ ఉన్నాడు. డిజీపీ అంటే పోలీస్ విభాగానికి హెడ్. ఆ డిజీపీ వెళ్ళి ఒక కానిస్టేబుల్‌కి "నాయనా, నువ్వే నన్ను కాపాడాలి, నాకు చిన్న కష్టం వచ్చింది" అన్నాడట. ఒక్కసారి ఆలోచించండి కానిస్టేబుల్ డిజీపీని కాపాడతాడా? లేక డిజీపీ కానిస్టేబుల్‌ను కాపాడతాడా? పవర్స్ ఎవరి చేతిలో ఉన్నాయి? శక్తులు ఎవరి చేతిలో ఉన్నాయి? కొంచెం ఆలోచించండి? అలాగే, ఈ సృష్టిని సృష్టించిన వాడివి నువ్వే, సృష్టిని నడిపిస్తున్న వాడివి నువ్వే, సృష్టికి ఆధారమైన వాడివి నువ్వే! సమస్తం నువ్వే అయి ఉన్నావు, నీలోనే అన్నీ ఉన్నాయి. అంతటి గొప్పవాడైన నువ్వు, చిన్న కష్టం వచ్చిన వెంటనే చేతులు జోడిస్తే ఏమనుకోవాలి చెప్పండి.

నేను గమనిస్తున్నాను, చాలా చోట్ల చాలామంది ఏదో చిన్న సమస్య, అశాంతి, లేదా చిన్న బాధ వచ్చినా సరే వెంటనే దేవుడిని ఆశ్రయిస్తారు.

సాయిబాబా భక్తుడు అయితే "సాయిరామ్, సాయిరామ్" అంటాడు, కృష్ణ భక్తుడు అయితే "కృష్ణ, కృష్ణ" అంటాడు, రామ భక్తుడు అయితే "రామ

రామ” అంటాడు, శివ భక్తుడు అయితే “శంభో, శంభో” అంటాడు, మెహర్ బాబా భక్తుడు అయితే “బాబా, బాబా” అంటాడు. ఎందుకు అంటారు? రక్షిస్తాడని, అన్నీ అనుకూలించేటట్టు చేస్తాడని, కాపాడతాడని, సహాయం చేస్తాడని భావించి వేడుకుంటారు.

గుర్తుపెట్టుకోండి మీరు దేహం కాదు. ఈ దేహానికి ఒక పేరు పెట్టుకుని, అదే “నేను” అని అనుకుంటున్నారు. అంతేకాదు ఈ దేహాన్ని చూసి “నేను ఈ కులం వాడిని, ఈ మతం వాడిని, ఈ ప్రాంతం వాడిని” అని అనుకుంటారు. కాని ఇవేవీ మీరు కాదు. మీరు స్త్రీ కాదు, పురుషుడు కాదు మీరందరూ ఆత్మలే. చాలా స్పష్టంగా పత్రి గారు చెప్పారు ఆత్మే పరబ్రహ్మ అని, అంటే మీరే ఆ ‘పర బ్రహ్మ’. ఇది మీకు అవగాహన అయితే, మీలో ఎంతో మార్పు వస్తుంది.

మీరు ఎవరినైనా ప్రార్థించినా, వేడుకున్నా, పూజించినా మీరు తక్కువ, వారు ఎక్కువ అనే భావం మీలో ఉన్నట్టు. ఆ భావం అంటే “వారికంటే నేను తక్కువ” అనే హీన భావం.

ఇదే విషయాన్ని భగవద్గీత లో శ్రీకృష్ణుడు స్పష్టంగా చెప్పారు “నీ ఆత్మను నువ్వే ఉద్ధరించుకోవాలి. నీ ఆత్మను ఎప్పుడూ కించపరచు కోకూడదు.” ఎందుకంటే, నువ్వు నీ ఆత్మను కించపరచని రోజున ఆ ఆత్మే నీకు మిత్రుడై, నిన్ను గొప్పవాడిగా చేస్తుంది.

“ఆత్మైవ రిపురాత్మనః” నువ్వు కించపరిచిన రోజున, అదే ఆత్మ నీకు శత్రువై అపకారం చేస్తుంది అని ఎంత స్పష్టంగా చెప్పారో ఒక్కసారి ఆలోచించండి. అందుకే పత్రి గారు “ఎవరిని కాళ్ళ మీద పడొద్దు” అని చెప్పేవారు, మొదట్లో కొట్టేవారు కూడా, తర్వాత నేను గమనించాను ఎవరైనా ఆయనకు నమస్కారం చేస్తే, ఆయన తిరిగి నమస్కారం చేసేవారు.

ఒకసారి ఇలా చెప్పారు “నువ్వు ఎవరికి ఎంత వంగి నమస్కరిస్తే,

నీ శక్తి వారికి వెళ్తుంది." అందుకే కొందరు గురువులు కాళ్ళకు మొక్కించుకుని వారి శక్తిని గ్రహిస్తారు, శిష్యులు బలహీనులు అవుతారు, గురువులు శక్తివంతులుగా మారుతారు, అందుకే పత్రీజీ "వద్దు" అంటారు. అందరూ ఒకటే అందరూ సమానం, "చక్కగా షేక్ హ్యాండ్ ఇవ్వండి" అని చెప్పేవారు. కొంతమంది అడుగుతారు "పత్రి గారి కాళ్ళు నొక్కే వారు కదా? అని."

ఒకటే గుర్తుంచుకోండి ఏ పని చేసినా భావమే ప్రధానం. నువ్వు కాళ్ళ మీద పడి దండం పెట్టినప్పుడు "ఆయన నన్ను కాపాడతాడు, రక్షిస్తాడు" అనే హీన భావంతో చేస్తావు కాబట్టి నువ్వు ఇంకా హీనుడవుతావు. అదే, నువ్వు గురుసేవగా "ఇంత గొప్ప జ్ఞానం ఇస్తున్న గురువుకు నేను సేవ చేస్తున్నాను" అనే భావంతో చేస్తే అది హీన భావం కాదు. ఇక్కడ సేవ వేరు, హీన భావం వేరు.

అందుకే పత్రిగారు కాళ్ళు నొక్కడాన్ని ఎప్పుడూ తిరస్కరించలేదు. అలాగే, చాలామందికి ఆయన దగ్గరకు వెళ్లడమే భయం. "ఎలా వెళ్దాం? ఎలా దగ్గర కూర్చుని ఆయన మాటలు విందాం?" అనుకుంటారు, అవకాశం ఎలా వస్తుంది అని సందేహపడుతుంటారు. అందుకే చాలామంది ఏమి చేసేవారంటే సేవ చేస్తూ, ఆయన మాటలు వినేవారు. ఆయన దగ్గరగా ఉండి, ఆయన ఆరాలో ఉండేవారు, అందుచేత పాదసేవలోని అర్థం ఇంకేమీ లేదు.

ఒక సందర్భంలో షిరిడి బాబా వారు ఒక శిష్యునికి గురువును ఎలా ప్రశ్నించాలి? ఏ సందర్భంలో ప్రశ్నించాలి? ఏ విషయాల గురించి ప్రశ్నించాలి? అన్న దాని గురించి వివరంగా చెప్పడం జరిగింది. దానిని 39వ అధ్యాయంలో 293 – 294 పేజీలలో వివరించడం జరిగింది.

ఒక రోజు బాబా శిష్యుడైన నానా సాహెబ్ కు ఈ విషయమై చక్కని వివరణ ఇవ్వడం జరిగింది. నానాసాహెబ్ భగవద్గీతలోని ఒక శ్లోకం గురించి అడుగగా బాబా చాలా చక్కగా దానిని వివరించారు.

శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదక్ష్యన్తితే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః (భ.గీ.4-34)

తా:- ఓ అర్జునా! అట్టి జ్ఞానము నీవు తత్త్వవేత్తలగు జ్ఞానులను అంటే మోక్షాన్ని పొందిన వారిని, అంటే పరబ్రహ్మమును తెలిసిన వారిని, సాష్టాంగ నమస్కారముచేసి, సమయముచూసి వినయంగా ప్రశ్నించి, సేవచేసి వారివలన తెలుసుకోవాలి. అప్పుడు వారు తప్పక నీకు ఉపదేశిస్తారు.

షిరిడి బాబా పై తాత్పర్యానికి గల అంతరార్థం నానా సాహెబ్ కు ఈ విధంగా వివరించారు.

1. ఎవరైనా ముందు ఉత్త సాష్టాంగ నమస్కారం చేస్తే సరిపోదు. సద్గురువులకు సర్వస్య శరణాగతి కావాలి.

2. ఊరికే ప్రశ్నిస్తే చాలదు. దుర్బుద్ధితో కానీ, దొంగ ఎత్తుతో కానీ, వారిని బుట్టలో వేయుటకు కానీ, వారి తప్పులను పట్టుటకు కానీ, పనికిమాలిన ఆసక్తితో కానీ అడగకూడదు. మోక్షమును పొందుటకు కాని, ఆధ్యాత్మిక అభివృద్ధికి కాని, నిజంగా తెలుసుకోవడానికి అడగాలి.

3. సేవ అంటే ఇష్టం ఉంటే చేయవచ్చు, లేకపోతే మానవచ్చు అనే అభిప్రాయంతో చేసేది సేవ కాదు. శరీరము తనది కాదని, తనకున్న ధనానికి తాను యజమాని కాదని, తన శరీరము గురువుగారిదని, వారి సేవ కొరకే శరీరం ఉన్నదని భావించాలి. అలా చేసినప్పుడు సద్గురువు తప్పకుండా జ్ఞానాన్ని బోధిస్తారు అని బాబా వివరించారు.

ఆ విధంగా నువ్వు గురువుకు సేవ చేస్తే, ఆయన బోధించే జ్ఞానం నువ్వు అడిగే ప్రశ్నలకు అనుగుణంగా, ఎంతో ఆసక్తిగా వివరిస్తారు, ఇది గీతలోనే ఉంది.

గురువు దొరికినప్పుడు, ఆయన సాంగత్యం ఎంత ఎక్కువగా చేయగలిగితే అంత మంచిది, అంత లాభం. మనకు తెలియని, మనకు అవసరమైన మెలుకువలు, సూక్ష్మాలు ఆయన నోటి నుంచి సహజంగానే

వస్తుంటాయి. అవన్నీ మీరు సేకరించుకోవాలి. నా వరకు నేను అదే చేసేవాడిని, పెన్ను పుస్తకం దగ్గర పెట్టుకొని ఆయన చెప్పినవన్నీ వ్రాసుకునే వాడిని.

మొదట్లో మా ఇంటికి వచ్చినప్పుడు ఆయన ఎక్కువ ఏమీ చెప్పలేదు. కానీ మూడు, నాలుగు సంవత్సరాలు తర్వాత ఒకటే చెప్పారు "నువ్వు ఏమీ అడగక్కర్లేదు, నా ప్రక్కన కూర్చో, అంతే" అన్నారు. అప్పుడు నాకు అర్థమైంది ఆయన పక్కనే కూర్చుని, ఆయన ఆరాలో ఉంటే చాలు అనే ఉద్దేశంతోనే ఆయన "నువ్వు అలా కూర్చో" అనేవారు.

అంతకు ముందు నేను ఏవో ప్రశ్నలు వేసి ఆయనను చిరాకు పెట్టేవాడిని. ఆ తర్వాత ఆయన ప్రక్కనే కూర్చుని ఆయన మాటలన్నీ గమనించే వాడిని, వ్రాసుకునేవాడిని. వ్రాయలేకపోతే గుర్తుంచుకుని తర్వాత నోట్ చేసుకునే వాడిని. ఆయన మాట్లాడుతూ ఉండేవారు అవి మాటలు మాత్రమే కాదు, ఎవరికో ఒకరికి సందేశాలే. ఇంకోటి కూడా చెప్పేవారు "గురువు దగ్గర ఉన్నప్పుడు ఎక్కువగా మాట్లాడకూడదు, వాళ్ళు చెప్పే మాటలు వినాలి అనేవారు"

మీరు ఎక్కువగా మాట్లాడితే, ఆయన ఏమి చెప్తారు? ఆయనకు ఏ సమయంలో ఏమి స్ఫురిస్తుందో! ఏ సందర్భంలో ఏమి చెప్తారో! ఆయనకే తెలియదు. అందుకే మేము ఆయన దగ్గరకు వెళ్లినా, ఆయన మా దగ్గరకు వచ్చినా మేము ఏ సమస్యలు అడిగేవారం కాదు.

అది ఆయనకు అర్థమైంది, ఆ తర్వాత ఆయన ఏమి చేసేవారంటే తన చేతులతో నాకు, మేడం ఉంటే మేడంకు భోజనం వడ్డించేవారు. ఆయన ముందుగా "భోజనం చేశావా? టిఫిన్ చేశావా?" అని అడిగేవారు. మాకు అంతకన్నా ఇంకేం కావాలి అనుకునేవాడిని, ఏది పెడితే అది తినేవాడిని. కానీ ఎంత తిన్నా, అరగంటలో మళ్ళీ ఆకలి వేసేది, అలా ఉండేది. మాకు ప్రత్యేకంగా కూర్చో బెట్టి ఏ బోధలు చేయలేదు, కానీ ఆయన ద్వారా ఎన్నో నేర్చుకున్నాను, అవే ఇప్పుడు అందరికీ చెబుతున్నాను. నా జీవితంలో అవి ఎంతో మార్పు తీసుకొచ్చాయి.

ఆయన ఏ సందర్భంలో ఏం చెప్పారో కూడా నాకు బాగా గుర్తుంది, ఆయన మాటలు ఎప్పుడూ మర్చిపోలేదు. ఇతరుల మాటలు అంతగా గుర్తుండేవి కావు కానీ ఆయన మాటలు మాత్రం బాగా రికార్డ్ అయ్యాయి. అవి ఆచరించడానికి కూడా ప్రయత్నించేవాడిని, ఎందుకంటే నాకు ఆయనపై పూర్తి నమ్మకం ఉంది. ఆయన పరిచయం కాక ముందు నేను ఎన్నో ఆశ్రమాలకు వెళ్లాను. హరిద్వార్, ఋషికేశ్ వరకు కూడా వెళ్లాను, ఆంధ్రా దగ్గర్లో ఉన్న ఆశ్రమాలకు కూడా తిరిగాను. ఆ గురువులను గమనించాను, వాళ్ళతో మాట్లాడాను. అలాగే కొన్ని పుస్తకాలు కూడా సేకరించి చదివాను.

ఒకసారి మలయాళ స్వామి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు అనుకున్నాను, “అయ్యో! ఆయన ఉన్నప్పుడు నేను ఉండి ఉంటే ఎంత బాగుండేది!” అని బాధపడ్డాను. మళయాళ స్వామి లేకపోవడం నాకు బాధ కలిగించింది. తర్వాత కొంతకాలానికి పత్రి గారి పరిచయం అయ్యారు, ఆయన పుస్తకాలన్నీ కొన్నాను. చాలా సార్లు చదివాను, ఆయన వీడియోలు కూడా పదే పదే విన్నాను. అందువల్ల నాకు ఎన్నో సందేహాలు క్లియర్ అయ్యాయి. అందులోఎంత గొప్ప సందేశాలు ఉన్నాయో అర్థమైంది. అవి నా జీవితాన్నే మార్చేశాయి అని చెప్పొచ్చు. ఇంతకన్నా తెలుసుకోవలసింది ఏమీ లేదు అన్నది నాకు అర్థమైంది.

ఇటువంటి గురువు లభించడం ఎంత అదృష్టం అనుకున్నాను. ఇలాంటి గురువు పరిచయం కలగడం నా భాగ్యం అని భావించాను. అప్పుడు “ఎంత తపన పడ్డానో ! అందుకే అందరికంటే గొప్ప గురువును పొందగలిగాను అనుకున్నాను”. అలాంటి గురువును ఎలా వదులుకుంటాము, అదే నాలో ఇంత మార్పు రావడానికి కారణం.

మీలో చాలామంది వింటారు, తెలుసుకుంటారు కానీ ఆచరణ ఉండదు, అదే అమ్మ చెపుతూ ఉంటుంది. **“గురువు ఉన్నప్పుడు శ్రద్ధగా లేకపోతే, గురువు నిష్క్రమించిన తర్వాత జీవితం దారం తెగిన గాలి పటంలా అవుతుంది.”** దాన్ని చాలామంది గ్రహించ లేకపోతున్నారు, సాధారణంగా తీసుకుంటున్నారు.

జ్ఞానం పొందిన గురువులు అంత తేలిగ్గా దొరకరు."గురువు" అని నోటికి వచ్చినట్టు చెప్పి మిమ్మల్ని మోసం చేసే వారు చాలామంది ఉంటారు. కానీ, ఇంత క్లియర్‌గా, ఇంత షార్ట్‌కట్‌లో, సోది లేకుండా చెప్పగలిగింది పత్రి గారే. అందుకే నాకు ఆయనపై అంత అభిమానం. ఎన్ని పుస్తకాలు చదివినా గ్రహించలేని సారం,ఆయన ఒక చిన్న పుస్తకంలోనే ఇస్తారు. ఆయన ఎంతోమంది మహానుభావుల సందేశాలను ఇచ్చారు. అందుకే నేను కూడా గొప్పవారి సందేశాలను సేకరించి, వాటి మీద అవగాహన పెంచుకుంటాను.

వాళ్ళు తమ జీవితంలో గ్రహించిన సారాన్ని సూక్తులుగా ఇస్తారు, అవి తెలుసుకుంటే చాలు. అవే నేను మీ అందరికీ చెబుతున్నాను. ఎంతోమంది గొప్ప యోగేశ్వరుల సందేశాలను నేను మీకు చెప్పాను. మన జూమ్‌లో అవన్నీ పుస్తకాలుగా కూడా వచ్చాయి, ఇంకా కొంతమందివి తీసుకురావాలి, తీసుకొస్తాను కూడా.

ఆ సందేశాల పుస్తకాలన్నీ తీసుకుని బాగా అధ్యయనం చేయండి. నిజంగా చెప్పాలంటే, ఆ పుస్తకాలన్నీ చదవడం చాలా ముఖ్యం. అందులో ముఖ్యమైన వాటిని నేను ఎంపిక చేసి మీకు వివరించాను. మీరు అది అర్థం చేసుకుంటే మీరు అదృష్టవంతులే. ఏ గురువు చెప్పినా సత్యాన్నే చెబుతారు, సత్యాన్నే ఆశ్రయించమని చెబుతారు, ఇంతకన్నా ఇంకేం లేదు.

యోగులు అందరూ సందేశాలు ఇచ్చారు, కానీ వాటిని ఆచరణలో పెట్టగలిగే విధంగా సులభంగా చెప్పింది పత్రి గారే. మళ్ళీ చెబుతున్నాను "శ్వాస మీద ధ్యాస" సామాన్యమైన సాధన కాదు, ఎంతో గొప్ప సాధన, ఎవరి ఊహకు అందని సాధన. దాన్ని ఎంతో సింపుల్‌గా పత్రీజీ మనకు ఇచ్చారు. ఆయన ఎన్నో అధ్యయనం చేసి, చివరికి "దీని కన్నా మించింది ఏదీలేదు" అని చెప్పారు. నేను కూడా ఎన్నోరకాల అధ్యయనాలు చేసి, ఇదే శ్రేష్ఠమని తెలుసుకున్నాను.

ఈ "శ్వాస మీద ధ్యాస" మీద కూడా నేను చాలా పరిశోధనలు చేశాను. అందుకే నేను చెబుతున్నాను, మన దగ్గరకు వచ్చే వారు, జూమ్‌లో

జాయిన్ అయ్యే వారు, భీమవరం వచ్చే వారు సామాన్యులు కాదు.

అశ్రద్ధ చేయకండి, వచ్చిన ఈ అవకాశాన్ని కోల్పోకండి. వ్యాపారం చేసుకునే నేను ఈ స్థాయికి రావడానికి కారణం పత్రి గారే, ఆయన నుంచి పొందిన జ్ఞానమే కారణం. ఆ జ్ఞానాన్ని గ్రహించి, ఆచరించడం వల్లే ఈ స్థాయికి రావడం జరిగింది.

అందుకే ఆఖరిగా చెప్తున్నాను "మిమ్మల్ని ఎవ్వరూ ఉద్ధరించలేరు, మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి, మీ కృషితో, మీ శ్రద్ధతో మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి".

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 12) గురుపౌర్ణమి విశిష్టత | - | రూ.60/- |
| 13) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 14) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 15) పంచకోశాలు | - | రూ.60/- |
| 16) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 20) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 21) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 22) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 23) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 24) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 25) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

# “మీరు చేసే ప్రతి పని ప్రకృతి గమనిస్తుంది”

ఏ విషయాలు అవుతే మానవులు మర్చిపోకూడదో, అనుక్షణము గుర్తుంచుకోవాలో, అవి గుర్తుంచుకుంటూ దానికి అనుగుణంగా జీవించాలి అంత ముఖ్యమైన విషయాలు మనం తెలుసుకుంటున్నాం.

“మీరు చేసే ప్రతి పని, ప్రతి మాటను ప్రకృతి (భగవంతుడు) గమనిస్తుంది అన్న విషయం ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి.” ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే మీ భవిష్యత్తు దీని పైనే ఆధారపడి ఉంటుంది.”

మీకు చిన్న ఉదాహరణ చెప్తాను ఎవరైనా సరే గుడికి వెళ్ళినప్పుడు ఒక్కసారి వాళ్ళ ప్రవర్తన కొంచెం గమనించండి. బయట చెప్పులు వదిలి గుడిలోకి వెళ్ళిన వెంటనే ఎంత వినయంగా, మర్యాదగా మారిపోతారో చూడండి. మెల్లిగా మాట్లాడతారు, చేతులు జోడిస్తారు, నమస్కారాలు చేస్తారు, చాలా పవిత్రంగా ప్రవర్తిస్తారు.

దేవుడు చూస్తున్నాడు, దేవుడు గమనిస్తున్నాడు నేను చేసే పనులు, మాటలు దేవుడికి తెలుస్తున్నాయి, అందుచేత మాట్లాడకూడని మాటలు మాట్లాడినా, చేయకూడని పనులు చేసినా, దేవుడు శిక్షిస్తాడు అనే భయం ప్రతి ఒక్కరికీ ఉంటుంది.

అందుకే వళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడుతారు, పనులు చేస్తారు. ఎంత పవిత్రంగా మారిపోతారో వేషం కూడా మార్చేస్తారు, బొట్లు పెడతారు, విభూది పూస్తారు. ఆ గుడిలో ఉన్నంత సేపు చేతులు జోడించి ప్రదర్శన చేస్తూ ఉంటారు.

ఇంకా కొంతమంది ఆ గుడిలోకి ప్రవేశించేటప్పుడు మామూలుగానే ప్రవేశిస్తారు. మళ్లీ బయటకి వచ్చేటప్పుడు అలాగే రివర్స్‌లో వస్తారు. ఎందుకు అంటే వీడు దేవుడికి ఎంతో గౌరవం ఇచ్చాడు అని వాడి ఉద్దేశం. “నా ముడ్డిని ఆయనకి చూపెట్టడం ఎందుకు? ఆయన వైపున ముడ్డిని తిప్పడం ఎందుకు?” అనే భావం వాళ్ళలో ఉంటుంది.

అందుచేత ఆ ముడ్డిని తన వైపే ఉంచుకొని, ముఖాన్ని ఆయన వైపు ఉంచుతాడు. ఎంతో భక్తుడిలా ప్రవర్తిస్తూ, భక్తిని అక్కడ ప్రదర్శిస్తూ ఉంటాడు. ఎందుకు అంటే దేవుడు గుడిలో ఉన్నాడు, ఆయన అన్నీ చూస్తున్నాడు అనే ఉద్దేశ్యం.

సరే, ఒకవేళ చూస్తూ ఉన్నాడు అనుకుంటే మటుకు నీ ప్రవర్తన మారిపోవాల్సిన అవసరం ఉందా? ఎందుకంటే నేను విరుద్ధంగా ప్రవర్తిస్తే, మాట్లాడకూడని మాటలు మాట్లాడితే, చేయకూడని పనులు చేస్తే, ఆయన శిక్షిస్తాడు, ఆయన శిక్షకు పాత్రుడిని అవుతాను అనే భయమే దానికి కారణం. అంటే వాళ్ళకి అవగాహన ఉంది.

దైవం ఎదురుగా ఉన్నప్పుడు అంటే గుళ్ళో విగ్రహం ఉంటుంది కదా ఆ విగ్రహం ఎదురు గుండా ఉన్నప్పుడు మాటలు కానీ, చేతలు కానీ విరుద్ధంగా ఉండకూడదు. ఎలా ఉండాలో కూడా వాళ్ళకి తెలుసు, ఏం చేయకూడదో కూడా వాళ్ళకి తెలుసు. అందుకే ఇన్ని ఆచరిస్తున్నారు.

ప్రతి ఒక్కరు ఎంత వినయం చూపిస్తారో చూడండి. లోపలికి వెళ్తే గంట కొడతారు, దండం పెట్టుకుంటారు, వాళ్ళు పట్టుకెళ్లినవన్నీ అక్కడ ప్లేట్లో పెడతారు. సాష్టాంగ నమస్కారాలు చేస్తారు, లెంపలు వేసుకుంటారు ఏం వినయం! ఒక్కసారి పూర్తిగా మారిపోతుంది. అక్కడ ఇచ్చిన ప్రసాదాన్ని కూడా కళ్ళకు అద్దుకొని మరీ తింటారు.

మీరు కొంచెం గమనించండి కాసేపటికి ఆ పని అయిపోతుంది. ఆ గుడిలో పని అయిపోయాక, దండం పెట్టుకొని, తాను సమర్పించవలసిన కానుకలన్నీ ఆ హుండీలో వేసి, తనకు కావాల్సిన కోరికలన్నీ కోరుకొని, మెల్లిగా బయటికి వస్తారు.

ఒక్కసారి అబ్జర్వ్ చేయండి బయటికి వచ్చిన తర్వాత, గుళ్లో ఉన్నప్పుడు ఉండే ప్రవర్తనకి, బయటికి వచ్చిన తర్వాత ఉండే ప్రవర్తనకి ఎంత భిన్నంగా ఉంటుందో  చూడండి. ఎవ్వరినైనా సరే అబ్జర్వ్ చేయండి దూరం

నుంచి, బయట ఉండి గాని, లేక పక్కన నిలబడి గాని చూడండి ఎంత మారిపోతుందో గమనించండి.

ఎందుకంటే నేను వెంకటేశ్వరస్వామి మందిరం నిర్మాణం జరుగుతు న్నప్పుడు ఖాళీ టైంలో వెళ్లి అక్కడే కూర్చొనే వాడిని. నాకు ఎక్కువగా అబ్జర్వేషన్ అలవాటు ఉంది. ప్రతి విషయాన్ని బాగా గమనిస్తూ ఉంటాను, వాటి మీద కొంచెం ఆలోచిస్తూ ఉంటాను. చూస్తే అక్కడ ఉన్న వినయం, భక్తి, శాంతం ఇవన్నీ బయటికి రాగానే కనిపించవు, వెంటనే మారిపోతుంది.

వాడు ఎవడో బయటికి వచ్చాక తెలుస్తుంది. వాడికి బాకీ ఉన్నవాడు ఎదురయ్యాడు. "ఏరా, ఎప్పుడు ఇస్తావ్?" అంటాడు. "ఇచ్చేస్తాను, వారం రోజులలో" అంటాడు. ఇంక వాడి మీద ఫైర్ అయిపోతాడు "ఈ వారం రోజులు, వారం రోజులు అని నువ్వు ఎప్పటి నుంచి చెప్తున్నావ్ రా? ఏడాది నుంచి ఇదే మాట కదా? కనబడినప్పుడల్లా ఇదే చెప్తావు. నీకు బుద్ధి ఉందా లేదా?" "ఇస్తావా? ఇవ్వవా? చెప్పు!" అని బూతులు కూడా లంకించు కొంటాడు. బయట ఇంతకన్నా ఇంకా కఠినంగా మాట్లాడుతారు. మీకు ఆశ్చర్యం వేస్తుంది, ఇప్పటిదాకా గుడిలో ఉన్నాడు, వీడిని చూస్తే ఎంత సౌమ్యుడు, ఎంత భక్తిపరుడు, ఎంత వినయం! చూసి మీరు ఆశ్చర్యపోయారు.

కానీ ఒక్కసారిగా ఇలా మారిపోయాడు ఏమైంది? అని చూస్తే కారణం ఒక్కటే అనిపిస్తుంది. ప్రతి ఒక్కరికి ఉన్న నమ్మకం ఏమిటంటే దేవుడు గుళ్లోనే ఉంటాడు, బయట ఉండడు అనే నమ్మకం, అభిప్రాయం. ఇది గుర్తు పెట్టుకోండి, ఎక్కడ చూసినా మీకు ఇదే కనిపిస్తుంది. మాటలు మారిపోతాయి, పనులు మారిపోతాయి, చేతలు మారిపోతాయి అన్నీ మారిపోతాయి.

ఎందుకంటే ఆయన చూస్తున్నాడు అనే భావం ఉన్నప్పుడు, మాట్లాడకూడని మాటలు మాట్లాడితే, చేయకూడని పనులు చేస్తే, ఆయన ఆగ్రహానికి గురవుతాం, ఆయన శిక్షకు పాత్రులు అవుతాం అన్న భయం ఉంటుంది. అందుకే ఇలా ప్రవర్తన మారిపోతుంది. కానీ బయట అలా ఎందుకు

ఉండదు అంటే బయట భగవంతుడు లేడు అనేటువంటి అభిప్రాయం వాడికి ఉంది. మరి దేవుడు ఎక్కడ ఉంటాడు? అంటే గుడిలోనే ఉంటాడు. గుడిలో ఉన్న విగ్రహమే దేవుడు అన్న అభిప్రాయం.

అందుచేత మీరు గుడిలోకి వెళ్ళినప్పుడు ఆయన చూస్తూ ఉంటాడు అనే ఉద్దేశంతో ప్రవర్తన మారిపోతుంది. అంటే ఆయన చూస్తూ ఉంటే ప్రవర్తన ఒక రకంగా ఉంటుంది, ఆయన చూడకపోతే ప్రవర్తన ఇంకో రకంగా మారిపోతుంది. చూసుకోండి మీరు ఎక్కడైనా సరే, గుడికి మీరే వెళ్లినా, మిమ్మల్ని మీరు గమనించుకున్నా మీకు అర్థమవుతుంది. అంటే అక్కడ ఒక విషయం అందరికీ అవగాహన ఉంది. ఏమిటంటే మీరు చేసే తప్పుడు పనులు, తప్పుడు మాటలు ఆయనకి తెలిస్తే ఆయన ఊరుకోడు, కఠినంగా శిక్షిస్తాడు అనే భయం. అదే వారి ప్రవర్తన మారిపోవడానికి కారణం. బయట ఎందుకు ఉండదు అంటే బయట భగవంతుడు లేడు కాబట్టి. ఆయనను లోపలే వుంచేశారు కదా? బయట లేడు కదా?

కానీ గుర్తుంచుకోండి భగవంతుడు అన్నవాడు,సర్వవ్యాపి, సర్వాంతర్యామి అంటే సర్వత్ర ఉన్నవాడు, అంతేకాదు, అందరి శరీరాల్లో కూడా ఉన్నాడు, ఇది మర్చిపోకండి.

అందుచేత ఆయనకు తెలియని ప్రదేశం లేదు. ఆయన చూడనిదంటూ లేదు. చీకటి గుహలో అయినా చూస్తాడు, కొండల్లో అయినా చూస్తాడు, ఏకాంత ప్రదేశంలో అయినా చూస్తూ ఉంటాడు. మీరు చేసేవన్నీ ఆయనకు తెలుస్తూనే ఉంటాయి. ఈ విషయాలు మర్చిపోకండి. అంతటి శక్తి కలవాడు భగవంతుడు అంటే దేవుడు.

ఆయనను తప్పుగా అర్థం చేసుకోవద్దు. ఆయనను గుడికే పరిమితం చేయకండి. సర్వవ్యాపి అయినటువంటి భగవంతుడిని ఒక గుడికి పరిమితం చేసి నువ్వు ప్రవర్తిస్తే నష్టపోయేది నువ్వే! అందుచేత భగవంతుడు గురించి నువ్వు తెలుసుకుంటే ఆయన సర్వవ్యాపి అని అర్థమవుతుంది. అప్పుడు నువ్వు

ఎక్కడ ఉన్నా, ఎక్కడ మాట్లాడుతున్నా, గుళ్ళో ప్రవర్తించినట్టుగానే ప్రవర్తిస్తావు.

అలా నువ్వు ప్రవర్తించినప్పుడు భగవంతుని కృపకు నువ్వు పాత్రుడవుతావు, భగవంతునికి ఇష్టుడవుతావు. ఎందుచేతనంటే ఆయన అంతటా ఉన్నాడు, అన్నిటా ఉన్నాడు. కాబట్టి ఎవరు ఎక్కడ ఏది చేసినా, అన్నీ ఆయనకు తెలుస్తూనే ఉంటాయి. ఈ విషయం ప్రతి ఒక్కరు మర్చిపోకూడదు.

అందుకే చెప్తున్నాను మీరు చేసే ప్రతి పని, ప్రతి మాటను ప్రకృతి అంటే భగవంతుడు గమనిస్తున్నాడు అన్న విషయం ప్రతి క్షణం గుర్తుంచు కోవాలి. అప్పుడు నువ్వు పొరపాటున కూడా తప్పు చేయవు, పాపాలు చేయవు, చేయకూడని పనులు చేయవు, అధర్మంగా వ్యవహరించవు, అబద్ధాలు ఆడవు, ఎవ్వరిని మోసగించవు, అవమానించవు, వాదించవు అంత జాగ్రత్తగా ఉంటావు.

నువ్వు అలా ఉన్న రోజున మీకు ఏ కష్టం వస్తుంది? ఏ నష్టం జరుగుతుంది? మీ జీవితమే అద్భుతంగా మారిపోతుంది. అందుచేత గుర్తుంచుకోండి మీరు చేసే ప్రతి పని, ప్రతి మాటను ప్రకృతి గమనిస్తుంది అన్నది మర్చిపోకండి.

ఈ విషయం ప్రతి క్షణం మీరు గుర్తుంచుకుంటే ఎక్కడ చూసినా ఆయనే అని అర్థం చేసుకొని ఆయనకి అంత గౌరవం ఇస్తారు. చిన్న ఉదాహరణ చూద్దాం. ఒక గురువుగారికి నలుగురు శిష్యులు ఉన్నారు. ఆయన ఎన్నో సంవత్సరాలుగా బోధ చేస్తున్నాడు, ఆయన ఏమనుకున్నాడంటే నేను చేసిన బోధ వీళ్ళు ఎంత వరకు అర్థం చేసుకున్నారో పరీక్షిద్దాం అనుకున్నాడు. ఆ నలుగురిని పిలిచాడు.

ఆయన ఏం చేశాడంటే నాలుగు అరటి పళ్ళు నలుగురికి ఇచ్చి, "ఎవ్వరూ చూడకుండా ఈ అరటిపండు తిని రండి" అని చెప్పాడు. అందరూ తలకోక దారికి వెళ్ళిపోయారు. మళ్ళీ కాసేపటికి రెండు గంటలకు తిరిగి వచ్చారు. అప్పుడు గురువుగారు ఒక్కొక్కరిని అడిగారు "మీరు ఎక్కడ తిన్నారు?" అని.

ఒకడు చెప్పాడు "నేను గుహలోకి వెళ్లానండి. విపరీతమైన చీకటి ఉంది, అక్కడ తినేసాను, ఎవ్వరూ లేరు, చూడడానికి ఆస్కారం లేదు" అన్నాడు. ఇంకొకడు అరణ్యంలోకి వెళ్లి "అక్కడ ఎవరూ లేరు, ఏమీ లేదు" అని అక్కడ తిన్నాను అన్నాడు. మరొకడు గదిలో తలుపులు వేసుకుని, లైట్లు కూడా ఆపేసి, శుభ్రంగా తినేసాను అన్నాడు.

కానీ ఒకడు మాత్రం తినకుండా పట్టుకొచ్చి గురువుగారికి ఇచ్చాడు. గురువుగారు అడిగారు "ఎందుకు తినలేదురా?" అని. అప్పుడు వాడు చెప్పాడు "గురువుగారు, మీరే కదా చెప్పారు భగవంతుడు సర్వాంతర్యామి, సర్వవ్యాపి అని. ఆయన లేని ప్రదేశం ఎక్కడుంది? ఆయన చూడకుండా నేను ఎక్కడ తినగలను?" అన్నాడు.

"మీరు ఎవరూ చూడకూడదు అన్నారుగానీ, అందరికంటే గొప్పవాడైన భగవంతుడు చూస్తున్నాడే! మీరు ఇచ్చిన పండు ఆయన చూస్తూ ఉండగా నేను ఎలా తింటాను? అందుకే తినకుండా తీసుకొచ్చాను" అన్నాడు.

అప్పుడు గురువుగారు "నాయనా అసలైన శిష్యుడివి, నన్ను అర్థం చేసుకున్నవాడివి నువ్వే" అని చెప్పారు.

ఇంకొక ఉదాహరణ చూద్దాం ఒకడు గురువు దగ్గరకు వెళ్ళి "భగవంతుడు ఎక్కడున్నాడో చెప్పండి స్వామి" అన్నాడు. అప్పుడు గురువు అన్నాడు "నువ్వు ఫలానా ఊరి చివర ఒక శివాలయం ఉంది, అక్కడికి వెళ్ళు, నీకు తెలుస్తుంది" అన్నాడు. వాడు వెళ్ళాడు, అక్కడ గర్భగుడిలో శివలింగం మీద కాళ్ళు పెట్టుకుని ఒక వ్యక్తి పడుకొని నిద్రపోతున్నాడు.

వాడికి ఆశ్చర్యమేసింది "వీడు ఇంత పాపిష్టివాడా! దేవుడి మీద కాళ్ళు పెడతాడా? వీడికి భక్తి లేదా?" అని అనుకున్నాడు. వాడి దగ్గరకు వెళ్ళి లేపి "ఏరా! నువ్వు చేసే పని ఏమిటి? దేవుడి మీద కాళ్ళు పెడతావా? ముందు కాళ్ళు తీసేయ్!" అన్నాడు.

అప్పుడు ఆ వ్యక్తి అన్నాడు "తీసేస్తాను బాబు, కానీ దేవుడు లేని

ప్రదేశం ఎక్కడుందో చూపించు, అక్కడ పెట్టుకుంటాను" అన్నాడు. అప్పుడు ఇతను ప్రక్కన ఒక ఖాళీ స్థలం చూపించాడు. చూస్తే అక్కడ కూడా లింగం ఉంది. ఇంకో చోటికి తీసుకెళ్లాడు అక్కడ కూడా లింగం ఉంది. ఎక్కడ చూసినా లింగమే! అన్నిచోట్ల దేవుడే! వాడికి మతి పోయింది.

ఇప్పుడు ఆ వ్యక్తి అడిగాడు "ఇప్పుడు నా కాళ్ళు ఎక్కడ పెట్టమంటావు? దేవుడు లేని ప్రదేశం చూపించు" అన్నాడు. అప్పుడు వాడికి అర్థమైంది భగవంతుడు అంతటా ఉన్నాడు, ఆయన లేని ప్రదేశం లేదు అని. వాడు అతని కాళ్ల మీద పడి "ఇప్పుడు నాకు అర్థమైంది. భగవంతుడు అన్నిచోట్ల ఉన్నాడు" అన్నాడు.

ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అలాంటి భగవంతుడు అంతటా ఉన్నాడు అంటే అన్నిచోట్ల మిమ్మల్ని గమనిస్తున్నాడు అన్న విషయం మర్చిపోకండి. ఏ తప్పులు చేయకండి, పాపాలు చేయకండి. ఎందుచేతనంటే ఈ సృష్టిలో, ఈ ప్రపంచంలో మీరు చేసే ప్రతి పని, ప్రతి మాటను ప్రకృతి గమనిస్తుంది, భగవంతుడు గమనిస్తున్నాడు.

ఈ విషయం ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి. గమనించడమే కాదు ఇంకో విషయం కూడా గుర్తుపెట్టుకోవాలి, అవన్నీ ప్రకృతిలో రికార్డు అవుతాయి, సమయానుసారం వాటి ఫలితాలు మీకు తిరిగి వస్తాయి. మీరు మంచి చేస్తే మంచి ఫలితం, చెడు చేస్తే చెడు ఫలితం అని మర్చిపోకండి.

ఈ విషయం మీరు నిజంగా అర్థం చేసుకున్న రోజున మీ జీవితంలో పెద్ద మార్పు వస్తుంది, మీరు సరైన విధంగా జీవిస్తారు, మీ భవిష్యత్తు అద్భుతంగా మారుతుంది.

# "ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు"

మనం గత కొన్ని రోజులుగా ముఖ్యంగా తెలుసుకోవలసినవి, మర్చిపోకూడని విషయాల మీద తెలుసుకుంటున్నాం. ఈరోజు ఇంకొక విషయం తెలుసుకుందాం, ఎటువంటి పరిస్థితిలో కూడా వీటిని మరచి పోకూడదు.

సృష్టిలో ఉన్నటువంటి

నియమాలు అయినా, ఏదైనా మీరు మర్చిపోయారు అంటే, మీరు చాలా నష్టపోతారు, మీ జీవితంలో దుఃఖాన్ని పెంచుకుంటారు. కాని ఆచరించగలిగితే మీ జీవితంలో దుఃఖమే ఉండదు. అంతేకాదు మీ లక్ష్యాన్ని కూడా మీరు సాధించ గలుగుతారు.

ఈరోజు చెప్పుకోబోయే ముఖ్య విషయం:

**"ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు"**

వాస్తవానికి అంటే, మీ జీవితంలో జరిగే సంఘటనలకి, మీకు ఎదురయ్యే సమస్యలకి అన్నిటికీ కారణం మీరే. అంతేకాదు, మీ ఈ సంసారం ఇలా ఉండడానికి మీకు లభించిన భర్త, భార్య, తల్లిదండ్రులు, పిల్లలు ఇవన్నీ మీరు ఎంచుకున్నవే, మీ నిర్ణయం ప్రకారమే అన్నీ జరుగుతున్నాయి, వాటికి ఎవ్వరూ కారణం కాదు.

ఎందుకంటే, మీరు గతంలో చేసిన, అంటే గత జన్మల్లో చేసిన కర్మలను బట్టి పై లోకాల నుంచి వచ్చిన మాస్టర్లు మీతో సంప్రదించి, మీరు ఎంచుకున్న కర్మలను బట్టి, భూమ్మీద మీకు ఎలాంటి పరిస్థితులు ఉండాలో నిర్ణయిస్తారు. మీ అంగీకారంతోనే అలాంటి పరిస్థితులు ఉండే జన్మ మీకు కేటాయించ బడుతుంది.

మీరు అలాంటి దేశంలో, అలాంటి రాష్ట్రంలో, అలాంటి ప్రదేశంలో, అలాంటి మతంలో, అలాంటి కులంలో, అలాంటి కుటుంబంలో, అలాంటి

తల్లిదండ్రులకు మీరు జన్మిస్తారు, ఆ వాతావరణంలోనే మీరు పెరుగుతూ ఉంటారు. అందుకే వయసు వచ్చాక ఎవరిని పడితే వారిని పెళ్లి చేసుకోరు, మీరు పైన నిర్ణయించుకున్న ప్రకారం వారు మీకు ఎదురయ్యేదాకా చూస్తూనే ఉంటారు. ఎప్పుడైతే వారు ఎదురవుతారో అప్పుడు మీరు వారిని ఎంచుకుంటారు. అలా ఎంచుకోవడం ద్వారా మీరు నేర్చుకోవాల్సినవి ఉన్నాయి. అందుకే అంటారు "ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు అని."

అంతేకాదు, మీకు వచ్చే కష్టాలు కానీ, భోగాలు కానీ ఏ దేవుడు కారణం కాదు. ఎవ్వరూ కారణం కాదు, మీరు ఎంచుకున్న కర్మలను బట్టే అవన్నీ మీకు ఎదురవుతాయి. ఆ సంఘటనలు జరుగుతాయి, ఆ కష్టాలు వస్తాయి, ఆ యాక్సిడెంట్లు జరుగుతాయి. వీటికి ఎవరి ప్రమేయం ఉండదు. ఇదొక్కటి మీరు తప్పకుండా గుర్తుపెట్టుకోండి, మీకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మీ నిర్ణయానికి విరుద్ధంగా ఎవరూ మీ మీద ఏదీ రుద్దలేరు. కానీ "కష్టాలు వస్తే నేను ఎలా కారణం అవుతాను?" అని మీరు అనుకోవచ్చు.

కానీ నిజం ఏమిటంటే నువ్వు ఎంచుకున్న కర్మలే అవి. ఎందుకు అలాంటి కర్మలు ఎంచుకున్నావు? ఎందుకంటే వాటి ద్వారా నువ్వు నేర్చుకోవాల్సిన పాఠాలు ఉన్నాయి. అనుభవాలు పొందవలసి ఉంది. అందుకే వాటిని ఎంచుకున్నావు. అందుచేత ఆ సంఘటనలు జరుగుతాయి. వాటి ద్వారా పాఠం నేర్చుకుంటావు. నీలో పరివర్తన వస్తుంది, ఇవన్నీ నీ ఆత్మ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయి. ఏ ఆత్మ ఎదుగుదల కోసం నువ్వు భూమి మీదకి వచ్చావో, అదే జరుగుతుంది. అందుకే పత్రి గారు "నీ జీవితంలో నీకు వచ్చే కష్టాలు, నష్టాలు, అవమానాలు ఇవన్నీ నీ ఆత్మ ఎదుగుదలకు సోపానాలు, మార్గాలు" అన్నారు.

పత్రిగారు స్పష్టంగా చెప్పారు కాబట్టి, జరిగే వాటికి బాధపడటం కాదు దాని నుంచి నేర్చుకోవలసింది ఏమిటి అన్నది ఆలోచించండి. మీరు

అనుకోవాలి ఇటువంటి పరిస్థితి నాకు ఎందుకు వచ్చింది? అంటే గతంలో నేను అవగాహన లేకుండా చేసిన కర్మలే కారణం.

అందుచేత వాటి నుంచి నేర్చుకుని, అలాంటి కర్మలు, అలాంటి పనులు ఇకపై చేయకుండా ఉండాలి, అలాంటి దృఢమైన నిర్ణయం తీసుకోవాలి. అప్పుడు మీరు చేసిన తప్పులకు పశ్చాత్తాపం కలుగుతుంది. ఆ పశ్చాత్తాపంతో "ఇలాంటి పనులు ఇక ఏ జన్మలోనూ నేను చేయను" అని మీరు నిర్ణయించు కుంటే, ఆ రకమైన కర్మలు మీకు ఎన్ని ఉన్నా, ఆ జ్ఞానం మీరు పొందినప్పుడు అవన్నీ దగ్ధమైపోతాయి.

అందుకే పత్రి గారు **"గతం అవగతం అయితే విగతం అవుతుంది అంటారు"** గతం అంటే, గతంలో మీరు చేసిన పాప కర్మలు. అవి ఎందుకు చేశారో అవగతమై, "ఇక మళ్లీ చేయను" అని మీరు దృఢంగా నిర్ణయించుకుంటే అవి విగతమైపోతాయి.

ఇదే గీతలో కూడా చెప్పబడింది "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అని. అటువంటి జ్ఞానం పొందినప్పుడు, ఆ కర్మలన్నీ దగ్ధమవుతాయి. అలా ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క పాఠం నేర్చుకుంటూ, మెల్లగా మీ తప్పులన్నీ సరిచేసుకుంటూ ఉంటారు. చివరకు ఏ తప్పు చేయని స్థాయికి ఎదుగుతారు.

ఎప్పుడైతే ఆ స్థాయికి మీరు చేరుకుంటారో మీకు ఇక జన్మే అవసరం ఉండదు. మరి మానవులు చేసే ఎన్నో తప్పులు ఉన్నాయి, వాటిని సరి చేసుకోవాలి. అలాగే ఈ సృష్టిలో మానవుడు నేర్చుకోవాల్సినవి ఎన్నో ఉన్నాయి. మీకు ఇవ్వబడిన లక్ష్యం ఏమిటంటే మీరు కూడా పూర్ణాత్మగా ఎదగాలి, తయారవ్వాలి.

పూర్ణాత్మగా తయారవ్వడం అంటే సృష్టికి ప్రతిసృష్టి చేయగల స్థాయికి ఎదగాలి. అలాంటి వారినే కో-క్రియేటర్స్ అంటారు. అంటే క్రియేటర్ ఏ పనులు చేస్తాడో, అలాంటి పనులన్నీ మీరు కూడా చేయగలగాలి. మరి క్రియేటర్ ఏమి చేశాడు? కోట్ల కొద్ది లోకాలను సృష్టించాడు. 84 లక్షల రకాల జీవులను

సృష్టించాడు. ఒక్కొక్క జీవిని సృష్టించాలంటే ఎంత మేధస్సు అవసరం!

ఎన్ని రకాల జాతులు ఉన్నాయి ఖనిజ జాతి, వృక్ష జాతి, క్రిమికీటక జాతి, మత్స్యజాతి, పక్షి జాతి, జంతు జాతి, మానవ జాతి. ఇన్ని రకాల సృష్టి చేయాలంటే అనుభవం లేకుండా, జ్ఞానం లేకుండా ఎలా సాధ్యం? అందుచేత ఇవన్నీ మీరు అనేక జన్మల్లో నేర్చుకున్నారు. అదే పని ఇప్పుడు కూడా మీరు చేస్తూనే ఉన్నాం.

ఇవి తెలియక, జీవితంలో జరిగే సంఘటనలకి బాధపడుతూ ఉంటారు. "నా జీవితం ఇలా అయిపోయింది. నాకు ఇలాంటి పిల్లలు, ఇలాంటి భర్త, ఇలాంటి భార్య, ఇలాంటి తల్లిదండ్రులు" అని బాధపడుతుంటారు. కానీ ఇవన్నీ కూడా మీరు నిర్ణయించుకున్న ప్రకారమే జరుగుతున్నాయి మీరు ఎదగడానికి మీరు ఎంచుకున్నవే. ఇది గుర్తుపెట్టుకోండి. అందుకే పత్రి గారు అంటారు "మీరు భూమిమీద శరీరంతో ఉన్నప్పుడు మాయలో ఉంటారు, శరీరం వదిలిన తర్వాత వాస్తవంలో జీవిస్తారు."

భూమి మీద ఉన్నప్పుడు పూర్తిగా మాయలో ఉంటారు. లేనివన్నీ ఉన్నట్లు అనుకుంటారు. మీకు సంబంధం లేని వారిని  కూడా మీకు ఎంతో దగ్గర వాళ్ళుగా భావిస్తారు. కానీ వాస్తవానికి ఎవరితోనూ మీకు శాశ్వత సంబంధం లేదు. ఎందుకు ఇక్కడ అలా అనుకుంటారు? మాయా ప్రభావం వల్ల.

కానీ ఎప్పుడైతే మీరు శరీరం వదిలేస్తారో, ఈ మాయా ప్రభావం నుంచి బయటపడతారు, వాస్తవంలోకి వస్తారు. ఏం అనుకుని, ఏం చేయాలనుకుని, ఏ ప్రణాళికతో భూమిమీదకి వచ్చారో అన్నీ మీరు ఇక్కడ మర్చిపోతారు. కానీ పైకి వెళ్ళిన తర్వాత అవన్నీ మళ్ళీ స్పష్టంగా గుర్తుకు వస్తాయి. "నేను దేహం కాదు, నేను ఆత్మను, నేను చేయవలసింది ఇది, నేను సాధించవలసింది అది" అని అన్నీ  గుర్తుకు వస్తాయి.

అక్కడన్నీ సరైన నిర్ణయాలే ఉంటాయి. కానీ భూమిమీదకి వచ్చిన

తర్వాత ఈ మాయా ప్రపంచంలో అన్నీ మర్చిపోతారు, విరుద్ధంగా జీవిస్తారు, విరుద్ధంగా ప్రవర్తిస్తారు. సృష్టికర్త ఇటువంటి మాయా ప్రపంచాన్ని సృష్టించి, మీరు పైన ఏమనుకున్నారో అన్నీ మర్చిపోయేలా చేసి ఈ మాయా ప్రపంచంలోనే మీ బుద్ధి, తెలివిని ఉపయోగించి వాస్తవాన్ని మీరు తెలుసు కోవాలని నిర్ణయించారు. అప్పటివరకు మీరు జన్మలు తీసుకుంటూనే ఉంటారు, ఇది ఆయన చేసిన కఠినమైన నిర్ణయం. మాయను జయించాలి, మాయలో నుంచి బయటపడాలి, వాస్తవంలోకి రావాలి, నువ్వు ఎవరో తెలుసుకోవాలి అని. మీరు అనుకోవచ్చు "ఇంత మాయా ప్రపంచంలో ఎలా తెలుసుకో గలుగుతారు? ఇంత కఠినమైన పరీక్ష ఎందుకు?" అని.

కానీ సృష్టికర్త మిమ్మల్ని సృష్టించి గాలిలో దీపంలా వదిలేయలేదు. ఈ మాయా ప్రపంచంలో మిమ్మల్ని ఉంచి, మీ గురించి మీరు తెలుసు కోవడానికి, మీరు ఎవరో తెలుసుకోవడానికి, మీరు దేని కోసం వచ్చారో తెలుసుకోవడానికి అనేక రకాలుగా ఏర్పాట్లు చేశాడు. కానీ మానవుడు సాత్విక గుణంలోకి వచ్చి, బుద్ధిని పెంచుకుని, ఇవన్నీ తెలుసుకునేంత వరకు గందరగోళంలోనే వుంటారు.

ఎప్పుడైతే బుద్ధిని పెంచుకుంటాడో, జ్ఞానం సంపాదిస్తాడో, ఈ కనిపించని విషయాలన్నింటి గురించి తెలుసుకుంటాడో అప్పుడు వాస్తవంలో జీవించడం ప్రారంభిస్తాడు. మాయా ప్రపంచంలోనే వాస్తవంలో జీవించడం మొదలుపెడతాడు. అలా మీరు కొంచెం ఆలోచిస్తే మీకు ఎన్నో రకాలుగా ఆయన తెలియచేస్తున్నాడని అర్థమవుతుంది.

ఆయన ప్రకృతి ద్వారా మీకు ఎన్నో పాఠాలు నేర్పే ప్రయత్నం చేస్తున్నాడు. ప్రకృతిలో జరిగే సంఘటనల ద్వారా, జీవుల ద్వారా ఎన్నో నేర్పిస్తున్నాడు. బుద్ధి ఉన్నవాడు ప్రతి దాని నుంచి నేర్చుకుంటాడు. మీకు బుద్ధి, జ్ఞానం ఉంటే ప్రతి విషయం నేర్చుకోవడానికే అని మీరు అర్థం చేసుకుంటారు. అలాగే మీ జీవితంలో జరిగే సంఘటనల ద్వారా కుటుంబంలో

భార్య, భర్త, పిల్లలు, తల్లిదండ్రులు వీళ్ల ద్వారా కూడా మీరు ఎన్నో నేర్చుకుంటారు.

కానీ మీ ఆలోచన ఏమిటంటే వీళ్లందరితో కలిసి ఎంజాయ్ చేస్తూ, సుఖంగా జీవించి, అలా శరీరం వదిలేస్తే సరిపోతుంది అనుకుంటారు. ఇక్కడ ఏదో సరదాగా జీవించడానికి ఎవ్వరూ రాలేదు. ప్రతి ఒక్కరు అనుభవాలు పొందడానికి, పాఠాలు నేర్చుకోవడానికి, జ్ఞానం పెంచుకోవడానికి ఆ విధంగా ఉన్నత లోకాలు పొందడం కోసమే భూమి మీదకి వచ్చారు.

"హాయిగా ఎంజాయ్ చేద్దాం, సుఖపడదాం" అని మాయ వల్ల అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు. ఇలా అనుభవాల ద్వారా నేర్చుకుంటూ, నేర్చుకుంటూ చివరికి ఒక సద్గురువుని ఆశ్రయిస్తారు. మీరు ఎవరైనా సరే, మొదట్లో గురువు అవసరం అనిపించదు, అంటే 300 జన్మల వరకు కూడా గురువు అవసరం కనిపించదు.

కానీ ఎప్పుడైతే సద్గురువుని ఆశ్రయిస్తారో! ఆయనకు ఎన్నో విషయాలు తెలుస్తాయి, ఆయనవల్ల వారి సందేహాలు నివృత్తి అవుతాయి, ఎన్నో నేర్చుకుంటారు, చేయకూడని పనులు మానేస్తారు, చేయవలసిన పనులే చేస్తూ ఉంటారు. అక్కడి నుంచి వారి ఎదుగుదల ఎంతో వేగంగా మారుతుంది. ఆ స్థితికి వచ్చిన వారే మీరంతా, మీరు చేయవలసింది ఏమీ లేదు కాస్త శ్రద్ధ పెట్టడమే.

గమనించండి ప్రకృతి ద్వారా కూడా మీరు నేర్చుకుంటూ ఉంటారు. దత్తాత్రేయుల వారు కూడా చెప్పారు "నేను 24 మంది గురువుల నుంచి నేర్చుకున్నాను" అని. ప్రకృతిలో ఉన్న ప్రతి జీవి నుంచి, ప్రతి సంఘటన నుంచి నేర్చుకున్నాను అన్నారు.

దానిని బట్టి అర్థం చేసుకోండి మీరు నేర్చుకోవడానికి ప్రకృతిలో ఎన్ని ఏర్పాట్లు ఉన్నాయో! ఒక గురువే వచ్చి బోధించాల్సిన అవసరం లేదు

ప్రతి సంఘటన నుంచి నేర్చుకోవచ్చు.

మీరు కొంచెం గమనిస్తే ఒక విషయం తెలుస్తుంది చిన్న విషయం అయినా దానిలో ఎంతో అర్థం ఉంటుంది, ఎంతో నేర్చుకోవాల్సింది ఉంటుంది. బుద్ధి వికసిస్తే ఆ చిన్న విషయంనుంచే మీరు ఎంతో నేర్చుకుంటారు. ఇంకా నేర్చుకోలేకపోతున్నారు అంటే, బుద్ధి ఇంకా పెరగలేదని అర్థం. అందుచేత నేను బుద్ధి పెంచుకోండి, బుద్ధి పెంచుకోండి అని చెబుతుంటాను.

బుద్ధి పెరగడానికి తీవ్ర సాధన అవసరం, అందుకే భీమవరం రమ్మంటాను. ఆహార నియమాలు పాటించండి, సాధన చేయండి అని చెబుతుంటాను. ఈ రెండూ పాటిస్తే బుద్ధి పెరిగి, ప్రతి విషయం నుంచి లోతుగా తెలుసుకుని నేర్చుకోగలుగుతారు. జీవితం అనేది నేర్చుకోవడానికి, ఎదగడానికి.

పత్రి గారు ఏమంటారంటే  సినిమాలు చూడాలి అంటారు. చాలా మంది ఎంజాయ్‌మెంట్ కోసం చూస్తారు, కానీ సినిమాల్లో జరిగే సంఘటనల ద్వారా కూడా నేర్చుకోవాల్సినవి ఉంటాయి, వాటి కోసమే సినిమా చూడాలి అని చెప్పేవారు.  కొన్ని సినిమాల్లో నేర్చుకోవడానికి ఏమి లేకపోతే చూడాల్సిన అవసరం లేదు. కానీ కొన్ని సినిమాల్లో ఎంతో నేర్చుకోవచ్చు. ఉదాహరణకు ''ఆ నలుగురు'' వంటి సినిమాలు మరణానంతరం గురించి ఎంతో చూపించారు.

మీరు సాధారణంగా చనిపోయే వరకు మాత్రమే ఆలోచిస్తారు. కానీ చనిపోయిన తర్వాత కూడా జీవితం ఉందని అర్థమవుతుంది. అలాంటి విషయాలు తెలుసుకున్నప్పుడు "ఈ జీవితమే కాదు, ఆ జీవితం గురించీ ఆలోచించాలి" అని అర్థమవుతుంది. అందుకే వాటికీ కొంత సమయం కేటాయించాలి. ప్రకృతి నుంచి, జీవుల నుంచి, మీ జీవితంలో జరిగే సంఘటనల నుంచి ప్రతి దాని నుంచి నేర్చుకోవాలి.

పిల్లల నుంచి నేర్చుకోవచ్చు, పురుషులు స్త్రీల నుంచి నేర్చుకోవచ్చు, స్త్రీలు పురుషుల నుంచి నేర్చుకోవచ్చు, లేని వాడిని చూసి నేర్చుకోవచ్చు, ఉన్నవాడిని చూసి నేర్చుకోవచ్చు, గురువుల నుంచి కూడా నేర్చుకోవచ్చు ఇవి అన్నీ నేర్పేవే. కానీ మీరు సామాన్య దృష్టితో చూస్తే ఇందులో ఏమి ఉంది? అని అనిపిస్తుంది.

కానీ మీరు ఆలోచిస్తే "దీని ద్వారా నేను నేర్చుకోవాల్సింది ఏమిటి?" అని కచ్చితంగా అందులో నుంచి అర్థం చేసుకుంటారు. ఒక కష్టం వచ్చింది అంటే ఏడుస్తూ కూర్చోవడం కాదు. "దీని నుంచి నేను ఏమి నేర్చుకోవాలి?" అన్న కోణంలో ఆలోచించాలి. అలా ఆలోచించినవాడు ఆ కష్టానికి కారణం నేనే అని తెలుసుకుంటాడు, అలా ఎంతో నేర్చుకుంటాడు. మీరు గమనించండి ఎవరి జీవితాలు ఒకే రకంగా ఉండవు. ఎందుకు ఇన్ని తేడాలు ఉంటాయి?

ఎందుకంటే, ఎవరికి వారు నేర్చుకోవాల్సినవి వేరు. అందుచేత వారి జీవితంలో జరిగే సంఘటనలు కూడా వేరుగా వుంటాయి. ఒకే కుటుంబంలో ఉన్నా సరే తల్లిదండ్రుల జీవితం, పిల్లల జీవితం ఒకేలా ఉండదు. అలాగే ఒక కుటుంబంలో పుట్టిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు ముగ్గురు, నలుగురు ఉంటారు. కానీ అందరి జీవితాలు ఒకేలా ఉంటాయా? అంటే ఉండవు. ఎవరు నేర్చుకోవాల్సిన పాఠాలను బట్టి వారి జీవితాలు ఉంటాయి.

ఒక తండ్రి తన పిల్లలందరూ సమానంగా ఉండాలని భావించి, ప్రక్క ప్రక్కనే నాలుగు ఇళ్ళు కట్టించాడు. కోట్లు ఖర్చు చేసి, ఎలాంటి తేడా లేకుండా అందరికీ ఒకేలా ఇచ్చాడు. కానీ తర్వాత ఒకరికి వ్యాపారంలో నష్టం వచ్చి ఇల్లు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇంకొకరు ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లిపోయాడు. ఇంకొకరు దానిని వేరే విధంగా ఉపయోగించు కున్నాడు.

తండ్రి ఎంత ఆలోచించినా, ఎంత చేసినా పిల్లల జీవితాలు అతను అనుకున్నట్టుగా లేవు. ఎందుకంటే ఎవరి జీవితం వారిది. వారు నేర్చుకోవాల్సిన

పాతాలు, వారు ఎంచుకున్న కర్మలను బట్టి వారి జీవితం ఉంటుంది.

అందుకే అంటారు "ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు." ఎంత అద్భుతమైన కొటేషన్! ఒక్కసారి లోతుగా ఆలోచించండి. మీ జీవితంలో దుఃఖం కలిగినా మీరే కారణం. భోగం కలిగినా మీరే కారణం. మీ జీవితంలో జరిగే వాటికి ఎవ్వరూ కారణం కాదు అని గుర్తుపెట్టుకోండి. ఈ కొటేషన్‌ను ఎప్పుడూ గుర్తుంచుకోండి మీ జీవితంలో జరిగేదానికి ఎవ్వరిని నిందించకండి. మీ తల్లిదండ్రులు కాదు, భర్త కాదు, భార్య కాదు, పిల్లలు కాదు, దేవుడు కూడా కాదు అన్నీ మీ నిర్ణయం ప్రకారమే జరుగుతున్నాయి, ఇది చాలా గొప్ప సత్యం. దీన్ని బాగా గుర్తుంచుకోవాలి, దీనిపై మీరు ఎంత ఆలోచిస్తే అంత మీకు జీవితం గురించి అర్థమవుతుంది. అర్థం అయినవాడు ఏం జరిగినా ఆనందంగా ఉంటాడు. అందుకే అంటారు జ్ఞాని దుఃఖంలో ఉన్నా కూడా ఆనందంగా ఉంటాడు, జ్ఞానం లేని వాడు మాత్రం చిన్న కష్టానికే కుమిలిపోతాడు.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# "నీరు పల్లమెరుగు, సత్యము వ్యాప్తి నెరుగు"

మీరు గత కొన్ని రోజులుగా ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన, ఆచరించవలసిన ముఖ్య విషయాలను తెలుసుకుంటున్నారు. కానీ వీటిని అశ్రద్ధ చేస్తే నష్టపోయేది మీరే. ఈ జ్ఞాన మార్గంలో వేగంగా ఎదగాలంటే ఈ సత్యాలను ఎప్పుడూ గుర్తుంచుకొని ఆచరించాలి. అప్పుడు మాత్రమే మీ జీవితంలో నిజమైన సక్సెస్ సాధించగలరు.

గొప్ప యోగులు, మహర్షులు తమ అనుభవంతో చెప్పిన సత్యాలు ఇవి. వాటిని విస్మరించి మన ఇష్టానుసారం జీవిస్తే మాయలో చిక్కుకుంటాం. ఈ ప్రపంచం మాయతో నిండింది. మీ చుట్టూ ఉన్న వారు కానీ, ఆకర్షణలు కానీ మిమ్మల్ని మాయలో పడేయడానికి ప్రయత్నిస్తాయి. అందుచేత మీ ప్రవర్తనను పరిశీలిస్తూ, సత్యాన్ని ఆశ్రయిస్తూ జీవించాలి.

అందుచేత యోగులు అనుభవపూర్వకంగా తెలుసుకున్న ఈ సత్యాలను గుర్తుంచుకుంటూ, జీవితాన్ని సరిచేసుకుంటూ ఈ మార్గంలో పయనిస్తే కచ్చితంగా సక్సెస్ అవుతారు. అంతేకాదు, వీటిని మీరు ఆచరణలో పెట్టుకుంటే ఎన్నో జన్మలు అవసరం ఉండదు చాలా తక్కువ జన్మల్లోనే మీ లక్ష్యాన్ని మీరు సాధించగలుగుతారు.

చాలా మంది ఈ ధ్యాన మార్గంలో టైం వృధా అవుతుందని అనుకుంటారు. "సంపాదించుకోకుండా ఏమిటి ఈ పని? ఇలా ఎందుకు ఉంటున్నారు?" అని అనుకుంటారు. "ఏదో చేసుకుని హాయిగా బ్రతకవచ్చు కదా?" అని భావిస్తారు. కానీ ఈ మార్గంలో మీరు పయనించినప్పుడు కొన్ని జన్మలనే మీరు ఆదా చేసుకున్నవారు అవుతారు.

రోజులో కొంత సమయం కేటాయించినా ఈ సాధన వల్ల కొన్ని జన్మలే తగ్గిపోతాయని వారికి అర్థం కాదు. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నవారు గొప్ప వారు. ఇప్పుడు ఇంకొక సందేశం గురించి తెలుసుకుందాము.

**"నీరు పల్ల మెరుగు, సత్యము వ్యాప్తి నెరుగు"**

"నీరు పల్లమెరుగు, సత్యము వ్యాప్తి నెరుగు" అనే ఉపమానం ఎంతో

గొప్పది. నీరు సహజంగా పల్లానికి ప్రవహించినట్లే, సత్యం కూడా దశ దిశలా వ్యాపిస్తుంది. కారణం సత్యం శాశ్వతం, అది మారదు, సత్యమంత గొప్పది కాని, మించింది కాని ఏదీ లేదు. కారణం సృష్టిలో కనిపించే ప్రతిదీ తాత్కాలికం, అంతేకాదు సుఖాలు, సంతోషాలు, సంబంధాలు అన్నీ కొంతకాలం మాత్రమే ఉంటాయి.

మనకు ఎంతో ప్రియమైన వ్యక్తులు లేదా వస్తువులు దూరమైనప్పుడు దుఃఖం ఎందుకు వస్తుంది అంటే, వాటిని శాశ్వతం అనుకున్నందువల్ల. కానీ సృష్టిలోని ప్రతిదీ తాత్కాలికమే అన్న సత్యం తెలుసుకుంటే మీరు దుఃఖాన్ని అధిగమించగలరు.

ఈ ప్రపంచంలో ఐశ్వర్యం, సంపదలు కూడా శాశ్వతం కాదు. ఒకప్పుడు గొప్ప ధనవంతులు కూడా కాలం మారితే ఏమీ లేని స్థితికి చేరుకుంటారు. అందుచేత సత్యమే శాశ్వతం, అసత్యం అశాశ్వతం అని తెలుసుకోవాలి.

అసత్యం ఆకర్షణగా కనిపిస్తుంది, మొదట్లో సుఖంగా అనిపిస్తుంది. కానీ చివరికి అది బాధను ఇస్తుంది. సత్యం మాత్రం కఠినంగా అనిపించినా, శాశ్వత ఆనందాన్ని ఇస్తుంది. అందుకే ఋషులు, యోగులు భోగాలను వదిలి సత్యాన్ని ఆశ్రయించారు.

జీవితంలో నిజంగా ఎదగాలంటే సత్యాన్ని వదలకూడదు, సత్యమే మాట్లాడాలి, సత్యమే ఆచరించాలి. సత్యం అంటే ఆత్మ, ఆంటే భగవంతుడు, మిగిలినదంతా తాత్కాలికమే. ఆత్మను ఆశ్రయించి జీవించే వారు ఎప్పటికీ ఎదుగుతూనే ఉంటారు.

అసత్యంలో పయనించే వారికి కూడా దుఃఖం ఉంటుంది, తలపెట్టిన కార్యక్రమాలు విఫలమవుతాయి, చాలా కష్టాలు ఎదురవుతాయి. వారు శక్తివంచన లేకుండా కృషి చేసినా కూడా వెంటనే సక్సెస్ కావడం జరగదు. ఏంటి ఇలా జరుగుతోంది? అని బాధపడతారు.

కానీ వారికి అర్థం కాదు, తాను తప్పు దారిలో నడుస్తున్నానని. అయితే తెలివైన వారు, సత్యంపై అవగాహన ఉన్నవారు మాత్రం సత్యంలోనే జీవించడానికి,

సత్య మార్గంలోనే పయనించడానికి కృషి చేస్తారు.

లోకంలో సత్యం చాలా కఠినంగా ఉంటుంది, అందుకే చాలామంది సత్యాన్ని ఆశ్రయించరు, అసత్యంలో పయనిస్తారు. మొదట్లో అది బాగున్నట్టే కనిపిస్తుంది, కానీ తర్వాత ఊహించలేనంత నష్టపోతారు. అంతేకాదు, సత్యంలో పయనించే వారికి ప్రకృతి యొక్క సహకారం లభిస్తుంది, ప్రకృతి అన్నా, భగవంతుడు అన్నా ఒకటే. అందువల్ల ఎవ్వరైనా సరే జీవితంలో, ముఖ్యంగా జ్ఞాన మార్గంలోకి వచ్చిన వారు ముందుగా సత్యంపై అవగాహన పెంచుకోవాలి.

సత్యం యొక్క గొప్పతనం తెలుసుకోవాలి. అందుకే నేను సత్యంపై ఒక పుస్తకం కూడా వ్రాశాను. ఉపనిషత్తులు మరియు గొప్ప గొప్ప గ్రంథాల నుండి నేను తెలుసుకున్న విషయాలను ఆ పుస్తకంలో ఉదహరించాను. ఎందుకంటే సత్యమే శాశ్వతమైనది, ఎల్లప్పుడూ ఉంటుంది. అది మార్పు చెందదు, యుగ యుగాలైనా సరే మారదు.

లోకంలో మీకు కనిపించేవన్నీ కూడా  అసత్యం నుంచి ఉద్భవించినవే! అవి  కొంతకాలమే ఉంటాయి, తర్వాత అదృశ్యమైపోతాయి. అంటే సత్యం కానివి అన్నీ తాత్కాలికమైనవే అని తెలుస్తుంది.

అందుచేత తాత్కాలికమైన వాటి వల్ల పొందేది ఏదైనా సరే తాత్కాలికంగానే ఉంటాయి. అవి ఉన్నప్పుడు మొదట్లో ఎంతో తృప్తిగా, సుఖంగా, సంతోషంగా అనిపిస్తాయి. కానీ అవి దూరమైనప్పుడు ఎంత దుఃఖం వస్తుందో మీరు గమనించండి.

ఉదాహరణకు, ఎన్నో సంవత్సరాలు ఎదురు చూసిన తర్వాత ఒక పిల్లవాడు కలిగితే మీ ఆనందానికి అవధులు ఉండవు. ఆ పిల్లవాడు కొంతకాలం పెరిగి, మిమ్మల్ని ఎన్నో విధాలుగా సంతోషపరుస్తాడు, "నా అదృష్టం" అని అనుకుంటారు. కానీ కొంతకాలానికి అతను దూరమైతే, మీ దుఃఖం ఎలా ఉంటుందో చూడండి, తట్టుకోలేరు, భరించలేరు, జీవితం వృథా అని అనిపిస్తుంది.

ఎందుకంటే మీరు అతను శాశ్వతం అనుకున్నారు, కానీ సృష్టిలోని

సత్యం మీకు తెలియలేదు. సృష్టించబడినవన్నీ కూడా అసత్యమే అంటే తాత్కాలికమైనవే, ఎప్పుడో ఒకప్పుడు అదృశ్యమయ్యేవే అన్న విషయాన్ని గ్రహించ లేకపోయారు, అందుకే దుఃఖానికి లోనయ్యారు.

అలాగే, మీరు ఎంతో ఇష్టపడే భర్త కానీ, భార్య కానీ అకస్మాత్తుగా చనిపోతే, మీ జీవితం ఎండిపోయిన చెట్టులా తయారైపోతుంది. ఎందుకు అలా జరిగిందో అర్థం కాదు, కారణం జ్ఞానం లేదు. జ్ఞానం ఉన్నవారికి తెలుసు సృష్టించబడినవన్నీ తాత్కాలికమే, శాశ్వతం కాదు అని. అలాగే జీవితంలో సంపదలు రావచ్చు, పోవచ్చు అవి కూడా శాశ్వతం కావు.

ఒకప్పుడు ఇరాన్‌లో అపర కోటీశ్వరులు ఉండేవారు. ఈ మధ్య జరిగిన యుద్ధంలో వారి ఐశ్వర్యం అంతా పోయి, బిచ్చగాళ్ళలా బ్రతకాల్సిన పరిస్థితి వచ్చింది. అంతులేని భోగాలతో తులతూగిన వారు, ఏమీ లేని వారిగా మారిపోయారు.

అందుచేత జీవితంలో సత్యమే శాశ్వతం, అసత్యం అశాశ్వతం అని తెలుసుకోవాలి. అసత్యంలో మునిగిపోకుండా సత్యం ఏమిటో తెలుసుకొని, సత్యాన్ని ఆశ్రయించి, సత్యంలో జీవించడానికి ప్రయత్నించాలి. అప్పుడు మీ జీవితం ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది.

అసత్యంలో ఉంటే తాత్కాలికమైన సుఖ సంతోషాలు ఉంటాయి. కానీ సత్యంలో మీరు జీవిస్తే శాశ్వతమైన ఆనందాన్ని పొందుతారు. అందుకే ఋషులు, మహర్షులు, యోగులు, యోగీశ్వరులు ఈ విషయాన్ని తెలుసుకుని భోగాలు, ఐశ్వర్యాలు, సంపదలను వదిలి సత్యాన్ని ఆశ్రయించారు. సత్యంలో జీవించి, చివరికి ఆ సత్యాన్నే పొందగలిగారు, శాశ్వత ఆనంద స్థితిని పొందగలిగారు.

అందుచేత ముందుగా సత్యం అంటే ఏమిటి? అసత్యం అంటే ఏమిటి? అన్నది బాగా అవగాహన చేసుకోండి. సత్యం యొక్క గొప్పతనం తెలుసుకోండి. సత్యం ఏమిటో తెలుసుకోకుండా మీరు ఎన్ని సందేశాలు విన్నా, ఎంత ధ్యానం చేసినా, ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా, ఎన్ని జూములలో పాల్గొన్నా ప్రయోజనం ఉండదు.

అసత్యం ఆకర్షణగా ఉంటుంది, దాని వెనక పరుగెత్తకండి. సత్యం

బయటికి కనిపించదు కాబట్టి దాని గొప్పతనం వెంటనే అర్థం కాదు. కానీ మీరు ఇప్పుడు ఈ ఆధ్యాత్మిక మార్గంలో, జ్ఞాన మార్గంలో, ఆత్మ మార్గంలో ప్రవేశించిన తర్వాత ఎదగాలని కోరుకుంటున్నారు.

కాని మీరు ఊహించిన దాని కంటే ఎక్కువగా ఎదగాలంటే, జ్ఞానం పెరగాలంటే, నైపుణ్యాలు పెరగాలంటే సత్యాన్ని ఎప్పుడూ వదలకూడదు. సత్యం వైపు పయనించాలి, సత్యానికి ప్రాముఖ్యం ఇవ్వాలి, సత్యం ఏమిటో తెలుసుకోవాలి.

నేను ఎంతో మందిని చూశాను సత్యాన్ని పట్టుకున్నంత కాలం వారికి తిరుగుండేది కాదు. కానీ ఏదో ప్రలోభం వల్ల సత్యాన్ని వదిలి అసత్యంలోకి వెళ్లినప్పుడు వారు అర్ధాంతరంగా నిష్క్రమించాల్సి వచ్చింది.

ఏదైనా సరే, మీరు గమనించండి జీవితం సక్సెస్ కావాలంటే? సత్య మార్గంలోనే పయనించాలి. చూడటానికి అది ఆకర్షణగా ఉండకపోవచ్చు. కానీ ఆకర్షణగా కనిపించే దారి అసత్యమైతే, దాని ఫలితం అపజయమే, ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి.

మీరు ఈ మార్గంలో ఎదగాలని, మీరు చేసే ప్రతి పని సక్సెస్ కావాలని కోరుకుంటారు, కాని దానికి సత్యాన్ని వదలకూడదు. నిర్మోహ మాటంగా, నిర్భయంగా సత్యాన్ని అనుసరించాలి, సత్యమే మాట్లాడాలి, సత్యమే చెప్పాలి. సత్యం అంటే ఆత్మ అంటే  భగవంతుడు.  ఇది తప్ప మిగిలిన దంతా అసత్యమే. భగవంతునిచే సృష్టింపపండిన ఈ విశ్వం అంతా అశాశ్వతమే.

అందుచేత ఎవరైతే ఆత్మను ఆశ్రయించి, ఆత్మ మార్గంలో పయనిస్తూ, ఆత్మగా జీవిస్తూ, ఆత్మకు ప్రాముఖ్యం ఇస్తారో వారికి తిరుగుండదు. వారు ఎప్పటికప్పుడు ఎదుగుతూనే ఉంటారు, అంతులేని ఎదుగుదల సాధిస్తారు.

అలాంటి వారిని ఎంతో మందిని చూశాం. ఒక బుద్ధుడిని చూడండి, రమణ మహర్షిని చూడండి వారు దశ దిశలా ఎలా వ్యాపించారో! ఒకసారి పత్రి గారి ప్రత్యేకతో ఇలా అన్నాను, “ఇంకా చాలా చేయాల్సి ఉంది” ఎప్పటికి చేయగలం అని అనిపిస్తుంది అని అన్నప్పుడు ఆయన ఇలా చెప్పారు,  రమణ మహర్షిని

ఉదాహరణగా తీసుకోండి ఆయన మౌనంగా ఒక చోటే ఉండేవారు, పెద్దగా మాట్లాడేవారు కాదు, సందేశాలు కూడా ఎక్కువగా ఇవ్వలేదు, అయినా ప్రపంచం నలుమూలల నుంచి వేల మంది వచ్చి ఆయనను ఆశ్రయించేవారు.

ఆ కాలంలో ఈ స్థాయి టెక్నాలజీ లేదు, ఇప్పుడు మీకు టెక్నాలజీ ఉంది, ప్రపంచమంతా తిరుగుతున్నారు, వీడియోలు చేస్తున్నారు, పుస్తకాలు వ్రాస్తున్నారు, సందేశాలు ఇస్తున్నారు. అయినా మీరు ఎందుకు ఎదగలేక పోతున్నారు?

దానికి కారణం రమణ మహర్షి సత్యాన్ని గట్టిగా పట్టుకున్నారు. అందుకే ఆయన అంత గొప్పవారయ్యారు. ఇప్పుడు సమాజంలో ఒక ప్రక్క సత్యం ఉంది, ఇంకొక ప్రక్క అసత్యం ఉంది. సత్య సాధన ఉంది, అలాగే మ్యూజిక్, గైడింగ్ వంటి అసత్య సాధనలు కూడా ఉన్నాయి.

మనమంతా “శ్వాస మీద ధ్యాస” అనే సత్య సాధనను ఆశ్రయించాం. కానీ చాలామంది అసత్య సాధనలు చేస్తున్నారు. మీరు గమనిస్తే, అసత్య సాధనలు మెల్లగా అదృశ్యమైపోతాయి. కానీ మనమంతా ఆశ్రయించిన ఈ సత్య సాధన మాత్రం కచ్చితంగా గొప్ప స్థితికి చేరుకుంటుంది.

సత్యాన్ని చెప్పేవారు, అనుసరించేవారు ఎంత ప్రారంభ స్థితిలో ఉన్నా కూడా, మెల్లిగా తెలియకుండానే ఎంతో అభివృద్ధి చెందుతారు. అందుచేత గుర్తుంచుకోండి ఈ మార్గంలోకి వచ్చిన మీరు సత్య మార్గంలో పయనించాలంటే ఖచ్చితంగా “శ్వాస మీద ధ్యాస” పెట్టి ధ్యానం చేయాలి, సత్యమైన ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని అందరికీ బోధించాలి, ఇది తప్ప వేరే మార్గం లేదు.

అందుచేత ఇది బాగా అర్థం చేసుకోండి. పత్రి గారు ఇచ్చిన ఈ ఉపమానం ఎంతో అద్భుతమైనది “నీరు పల్లమెరుగు, సత్యము వ్యాప్తి నెరుగు” అన్న దానికి తిరుగు లేదు.

# “కోట్లు ఉన్నవాడు ధనవంతుడు కాదు, తృప్తి ఉన్నవాడే ధనవంతుడు”

మీరు గత కొన్ని రోజులుగా జీవితంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గుర్తుంచుకోవాల్సిన మరియు ఆచరించవలసిన ముఖ్యమైన సత్యాలను చెప్పుకుంటున్నాము. ఇవి కొత్త విషయాలు కాకపోయినా, వాటిని అర్థం చేసుకొని జీవితంలో అమలు చేస్తేనే వాటి అసలు విలువ తెలుస్తుంది. ఈ సత్యాలన్నీ మీరు అర్థం చేసుకున్నప్పుడు మీ జీవితంలో ఎటువంటి వాటికీ ప్రాముఖ్యం ఇవ్వాలి, ఎటువంటి వాటిని ప్రక్కన పెట్టాలి అన్న విషయాలలో ఒక స్పష్టత వస్తుంది. మీ జీవితాన్ని పూర్తిగా వినియోగించు కుంటున్నారా? లేకపోతే లేని వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారా? అన్నది తెలుస్తుంది.

అందుకే ఈ విషయాలన్నింటినీ మరల మరల చర్చించుకోవడానికి, గుర్తుంచుకోవడానికి కారణం. ఇవి మీకు తెలియని విషయాలు కావు, కానీ తెలిసినదాన్ని ఆచరణలో పెట్టడమే ముఖ్యము. అందుకే ఇటువంటి విషయాలను నోట్ చేసుకుని, మధ్య మధ్యలో తిరిగి చదివితే అవి మీలో స్థిరపడతాయి.

మీ నిత్య జీవితంలో అలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు, ఆ నోట్స్ మీకు మీరే హెచ్చరించుకునే అవకాశం కలుగుతుంది. అప్పుడు “ఇలా చేయకూడదు” అని తెలుసుకుని, మీరు మీ ప్రవర్తనను సరిచేసుకోవచ్చు. అలా ప్రవర్తించడం ద్వారా మీరు సృష్టి నియమాలకు అనుగుణంగా జీవించిన వారవుతారు. ఇవి సాధారణమైన విషయాలు కావు, ఇవి మీ భవిష్యత్తును ఎంతో గొప్పగా తయారు చేయగల శక్తి కలిగినవి.

కానీ ఇవన్నీ మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి, అందుకే ఈ విషయాలపై మీరు కాస్త శ్రద్ధ పెట్టాలి. నేను ఈ విషయాలను ప్రత్యేకంగా

మరలా చెప్పడానికి, వాటి గురించి వివరించడానికి కారణం కూడా అదే. తెలుసుకోవడం మాత్రమే ముఖ్యం కాదు, తెలుసుకున్నదాన్ని ఆచరణలో పెట్టగలగడం మరింత ముఖ్యం. మీరు ఎన్ని విషయాలు తెలుసుకున్నారన్నది ప్రధానం కాదు, అందులో ఎన్ని మీరు ఆచరించగలుగుతున్నారు అన్నదే ముఖ్యము.

ఇప్పుడు ఇంకొక సందేశం తెలుసుకుందాం.

**"కోట్లు ఉన్నవాడు ధనవంతుడు కాదు, తృప్తి ఉన్నవాడే ధనవంతుడు."**

అంటే సంతోషంగా జీవించడానికి కోట్లు అవసరం లేదు, తృప్తి ఉంటే చాలు. ఇప్పుడు దీనిని కాస్త లోతుగా పరిశీలిద్దాం. ఎందుకంటే, ప్రపంచాన్ని మీరు గమనిస్తే, ఎక్కువ శాతం మంది, అంటే 99% మంది ధనానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు, ధన సంపాదనకే జీవితమంతా కేటాయిస్తున్నారు.

కారణం లోకంలో "ధనం ఉన్నవాడే గొప్పవాడు" అనే భావం వుంది. ఎంత ఎక్కువ ధనం ఉంటే వాడు అంత గొప్పవాడని నమ్ముతున్నారు. ఈ భావం వల్లే, చాలా మంది ధనం సంపాదించడానికి చేయకూడని పనులు చేస్తున్నారు, తప్పులు చేస్తున్నారు, అధర్మంగా వ్యవహరిస్తున్నారు, మోసాలు చేస్తున్నారు, మాయమాటలు మాట్లాడుతున్నారు. ఎందుకంటే, వారికి అదే గొప్పగా అనిపిస్తోంది.

అలా సంపాదించిన డబ్బును వారు విలాసాలకు, విందులకు, ఆర్భాటాలకు, ఇతరుల ముందు గొప్పను ప్రదర్శించడానికి ఖర్చు చేస్తున్నారు. కానీ మీరు నిజంగా ఆలోచిస్తే ఇవన్నీ అవసరమా? అంటే అవసరం కాదు, ఇవి కేవలం ఇతరులకు గొప్పగా కనిపించాలని మాత్రమే.

"నేను గొప్పగా చేశాను", "పది మందికి గొప్పగా కనిపించాను" అని మీరు అనుకోవచ్చు. కానీ, అధర్మంగా సంపాదించి, ఆర్భాటంగా ఖర్చు

చేసినా అది మీకు ఏమైనా లాభం ఇస్తుందా? మీ ఉన్నతికి దోహదం చేస్తుందా? అంటే నిజానికి, కొద్దిగా కూడా ఉపయోగపడదు.

అందుకే నేను మీకు చెప్పేది ఒకటే  ముందుగా మీరు ఎవరో తెలుసుకోండి. ఈ విషయం మీద మీరు లోతుగా ఆలోచిస్తే, మీకు స్పష్టంగా అర్థమవుతుంది. మీరు “ఈ దేహం కాదు, మీరు ఆత్మ.” అంతేకాదు ఈ సృష్టిలో కనిపించే ప్రపంచమే కాదు. కనిపించని ఇంకో ప్రపంచం ఉంది. ఈ లోకమే కాదు, ఇంకా ఎన్నో లోకాలు ఉన్నాయి. అలాగే, మీరు ఇప్పుడు అనుభవిస్తున్నదే జీవితం కాదు, ఇంకా శాశ్వతమైన జీవితం ఉంది.

గొప్పల కోసం మీరు గడిపే ఈ జీవితం తాత్కాలికం, కానీ మీకు తెలియని ఆ జీవితం శాశ్వతమైనది. మీరు కష్టపడవలసింది, కృషి చేయవలసింది ఈ తాత్కాలిక జీవితం కోసం కాదు, కనిపించని ఆ శాశ్వత జీవితం కోసం.

మీరు బుద్ధి, జ్ఞానం ఈ రెండింటిని సంపాదించుకున్నప్పుడు, ఈ సత్యం మీకు అర్థమవుతుంది. ఆ కనిపించని జీవితంలో, కనిపించని “మీరు” అంటే ఆత్మ, ఆ ఆత్మకు లాభించేదే మీకు ఉపయోగపడేది. ఈ కనిపించే శరీరానికి, ఈ ఆర్భాటాలకు, ఈ ధనానికి అసలు ప్రయోజనం ఏమీలేదని మీరు గ్రహిస్తారు.

మీరు ఎంతో ఆర్భాటంగా, ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి, పది మంది ముందు గొప్పగా కనిపించడానికి ప్రయత్నించినా ఆత్మకు కొంచెమైనా లాభం ఉందా? అంటే మీరు నిజాయితీగా ఆలోచిస్తే ఏమీ లాభం లేదని స్పష్టంగా తెలుస్తుంది.

కానీ ఈ సత్యం సులభంగా అర్థం కాకపోవచ్చు, మీరు ఈ శరీరాన్ని విడిచిన తర్వాత, పైకి వెళ్ళినప్పుడు అది స్పష్టంగా తెలుస్తుంది. అప్పుడు మీరు అనుకుంటారు “అయ్యో! నేను ఎంత తప్పు చేశాను! ఎంత కష్టపడ్డాను! ఏదో

గొప్ప అనుకున్నాను, కానీ నాకు ఉపయోగపడింది ఏమీ లేదు!" అనుకుంటారు.

అప్పుడు మీరు ఆశ్చర్యపోతారు "ఇంత సంపాదించాను, ఇంతగా జీవించాను, కానీ నాకు లాభపడే పని ఒక్కటైనా చేయలేదే!" అని. పైగా ఆ సంపాదన కోసం మీరు చేసిన పాపాలు, తప్పులు, అధర్మమైన పనులు మిగిలి ఉంటాయి.

అప్పుడు మీకు స్పష్టంగా అర్థమవుతుంది "ఏమీ ఉపయోగం లేని దాని కోసం నేను ఎందుకు ఇన్ని పాపాలు చేశాను? ఎందుకు ఇన్ని తప్పులు చేశాను?" అని. ఆ జ్ఞానం వచ్చినప్పుడు, మీరు తీవ్రంగా బాధపడతారు.

"ఎంత పెద్ద తప్పు చేశాను! జీవితమంతా వృథా చేసుకున్నాను, ఈ జన్మనే వృథా చేసుకున్నాను. నా ఆత్మకు కొంచెమైనా ఉపయోగపడే పని ఒక్కటైనా చేయలేదు. ఏదో చాలా గొప్పగా చేశాను, అందరూ మెచ్చుకునేలా జీవించాను అనిఅనుకున్నాను అని మీరు బాధపడతారు.

ఆ సమయంలో మీకు ఒక గొప్ప సత్యం అర్థమవుతుంది మీరు చేసే పనులు లోకులు మెచ్చుకోవడానికి కాదు, లోకేశుడు మెచ్చుకునేలా ఉండాలి అని. కానీ అప్పటికే ఆలస్యమైపోతుంది, పైకి వెళ్ళేక "మళ్ళీ ఒక అవకాశం ఇవ్వండి" అని మీరు ఎంత బ్రతిమాలినా లాభం లేదు.

కానీ, ఎవరు ఈ సత్యాన్ని భూమిపై ఉండగానే అర్థం చేసుకుంటారో! వారు నిజంగా అదృష్టవంతులు.

నా జీవితంలో కూడా ఇదే జరిగింది. దాదాపు 53 సంవత్సరాల పాటు నేను "డబ్బే ప్రధానం" అన్న భావంతో జీవించాను. సంపాదించడానికి వ్యాపారంలో ఎన్నో అబద్ధాలు చెప్పాను, ఎంతో మందిని మోసం చేశాను, చాలా మందిని బాధపెట్టాను.

కానీ సద్గురువు అయిన పత్రి గారు నా జీవితంలోకి వచ్చాక నాకు స్పష్టత వచ్చింది. సహజంగా అయితే ఈ సత్యం నాకు శరీరం విడిచిన తర్వాతే

అర్థమయ్యేది. కానీ నా అదృష్టం వల్ల, పత్రి గారి లాంటి సద్గురువు దొరకడంతో నేను భూమిపై ఉండగానే తెలుసుకోగలిగాను.

పైకి వెళ్లిన తర్వాత తెలుసుకుంటే, మళ్ళీ ఇంకో జన్మ కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. కానీ ఇక్కడే తెలుసుకున్నాను కాబట్టి, నా జీవితాన్ని పూర్తిగా మార్చుకున్నాను. ఆ తర్వాత నేను ఆ రకమైన సంపాదనను పూర్తిగా వదిలేశాను. గొప్పల కోసం జీవించే జీవన విధానాన్ని పూర్తిగా విడిచిపెట్టాను, అర్థం లేని ఆర్భాట ఖర్చులను మానేశాను, అవసరమైన వాటికే ఖర్చు పెట్టడం ప్రారంభించాను. ఇంకా, నా వద్ద ఉన్న దాన్ని లోక కళ్యాణానికి ఉపయోగపడే పనులకు వినియోగించడం మొదలుపెట్టాను.

నాలో ఇంత పెద్ద మార్పు ఎందుకు వచ్చింది? పత్రి గారు చెప్పిన విషయాలను నేను అర్థం చేసుకోవడం వల్లే ఈ మార్పు వచ్చింది. అందుకే ఈరోజు సందేశం **"కోట్లు ఉన్నవాడు ధనవంతుడు కాదు, తృప్తి ఉన్నవాడే ధనవంతుడు".** ఎందుకంటే, మీ దగ్గర కోట్లు ఉన్నా, వాటిని గొప్పల కోసం ఖర్చు పెట్టినా, ఆత్మ అయిన మీకు అందులో ఏమాత్రం లాభం లేకపోతే మీరు ఎలా ధనవంతుడు అవుతారు?

అందుకే అంటారు "తృప్తి ఉన్నవాడే ధనవంతుడు." తృప్తి ఉన్నవాడు అంటే, అవసరాలకు పరిమితమైన వాడు. అతను ఎంత వస్తే అంతలోనే తన అవసరాలను తీర్చుకుంటాడు. ఏదైనా కొద్దిగా మిగిలితే, దాన్ని లోక కళ్యాణానికి ఉపయోగిస్తాడు, ఆత్మ లాభం కలిగించే పనుల కోసం ఖర్చు పెడతాడు.

అలా తనకు, తన ఆత్మకు లాభం కలిగించే పనులు చేసే వాడే నిజమైన ధనవంతుడు. కోట్లు ఉన్నా, ఆత్మకు ఉపయోగపడకపోతే, ఆ ధనం వ్యర్థమే. అలాంటి వాడు ఎలా ధనవంతుడు అవుతాడు? ఎంత తక్కువ ఉన్నా, తన ఆత్మ లాభం కోసం ఖర్చు చేసి, ఆత్మను ఉన్నత స్థితికి చేర్చే పనులు చేసే వాడే నిజమైన ధనవంతుడు. "గొప్పల కోసం పరుగెత్తే వాడు ధనవంతుడు

కాదు, గొప్ప లోకాలకు చేరుకోగలిగిన వాడే అసలైన ధనవంతుడు.”

ఇది ఎవరికి సాధ్యం అవుతుంది? అవసరాలకు పరిమితమైన వారికి. అవసరాలకు పరిమితమైనవాడు ఉన్నదానితో తృప్తి పొందుతాడు.

పత్రి గారు చెప్పినట్లు “మీకు ఇవ్వబడిన దానితో జీవించడం తప్పు కాదు, కానీ దాన్ని సంపాదించడానికి తప్పులు చేయకండి, అధర్మంగా వ్యవహరించకండి.” అందుకే నేను ఒక పుస్తకం కూడా వ్రాశాను, జీవితకాలం ఎన్నో గొప్ప పనులు చేసినా, ఎన్నో అవార్డులు, రివార్డులు పొందినా, ఆత్మకు లాభం కలిగించే పని ఒక్కటైనా చేయకపోతే, అటువంటి వాడు ‘ఆత్మ హంతకుడే’ అని.

పైగా, చేయకూడని పనులు చేసి, ఆత్మకు నష్టం కలిగిస్తే, అతను ఎలా గొప్పవాడు అవుతాడు? “లోకంలో గొప్పవాడిగా కనిపించడం కాదు, లోకేశుడి దగ్గర గొప్ప వాడిగా ఉండాలి.” “లోకులని బట్టి మీరు జీవించకండి లోకేశుడిని బట్టి జీవించండి.”

మీరు చాలా సార్లు ‘‘వాడు ఏమనుకుంటాడు?’’, ‘‘వీడు ఏమనుకుంటాడు?” అని ఆలోచిస్తారు. కానీ అలా ఆలోచించే వాడు కొద్దిగా కూడా జ్ఞాని కాదు, పూర్తిగా అజ్ఞాని. ఎందుకంటే, వాడు ఇలా అనుకున్నాడు, వీడు అలా అనుకున్నాడు అని బాధపడుతూ జీవిస్తాడు.

నేను ఎప్పుడూ చెప్పేది ఇదే ఎవరు ఏమనుకున్నా మీకు ఎందుకు? మీరు చేసేది సరిగ్గా ఉందా? లేదా? అన్నది ముఖ్యం. మీరు దేహంగా భావిస్తే, ఇతరులు ఏమనుకుంటారో అనే ఆలోచన వస్తుంది, కానీ మీరు ఆత్మగా అర్థం చేసుకుంటే, ఎవరు ఏమనుకున్నా మీరు పట్టించుకోరు. ఎవరైనా ఏదైనా అనుకుంటే, మీకు ఏమవుతుంది? మీరు చేయవలసిన పనిని సరిగ్గా చేస్తే, మీ లాభం మీకు వస్తుంది, మీ ఉన్నతి మీకే కలుగుతుంది.

అందుకే గుర్తుంచుకోండి “కోట్లు ఉన్నవాడు ధనవంతుడు కాదు,

తృప్తి ఉన్నవాడే ధనవంతుడు.” అలాగే, సంతోషంగా జీవించడానికి డబ్బు అవసరం లేదు, తృప్తి ఉంటే చాలు. ప్యాలసులు కట్టి, ఏసీలు పెట్టి, ఆర్భాటంగా ఖర్చు చేస్తేనే సంతోషం వస్తుందని మీరు అనుకుంటారు. మీకు ఒక సమస్య వచ్చినా, ఒక రోగం వచ్చినా, ఒక కష్టం ఎదురైనా ఆ డబ్బు, ఆ ఆర్భాటం మీకు ఏమి చేస్తాయి? మీ సంతోషం ఎక్కడికి పోతుంది?

అందుకే, మీరు తృప్తిగా ఉంటే మీరు తప్పులు చేయరు, పాపాలు చేయరు, అధర్మంగా వ్యవహరించరు, అప్పుడు మీకు కష్టాలు కూడా రావు. మీరు ఉన్నదానితో సంతోషంగా జీవించగలుగుతారు, అసలు దుఃఖం లేకపోవడమే  సంతోషం. దుఃఖంతో జీవించే వాడికి సంతోషం ఎక్కడ ఉంటుంది? ఇది ఒక అద్భుతమైన సత్యం. దీనిని మీరు మరల మరల మననం చేసుకోండి అప్పుడే ఇది మీ జీవితాన్ని మారుస్తుంది.

- ధనం కోసం అధర్మంగా జీవించవద్దు, ఆత్మ లాభం కోసం జీవించండి.
- “గొప్పల కోసం జీవించే వాడు ధనవంతుడు కాదు, గొప్ప లోకాలకు చేరుకునే వాడే అసలైన ధనవంతుడు”
- కనిపించే జీవితం తాత్కాలికం, కనిపించని జీవితం శాశ్వతం.
- తెలుసుకోవడం కాదు తెలుసుకున్న దాన్ని ఆచరించడం ముఖ్యం.
- ధనం కోసం అధర్మంగా జీవించవద్దు, ఆత్మ లాభం కోసం జీవించండి.
- ఆర్భాటం కోసం ఖర్చు పెట్టొద్దు అవసరాలకు మాత్రమే ఖర్చు పెట్టండి.
- కనిపించే జీవితం తాత్కాలికం, కనిపించని జీవితం శాశ్వతం. అవసరాలకు పరిమితమైన వాడే తృప్తి గల వాడు.
- తృప్తి ఉన్నవాడికి దుఃఖం ఉండదు, దుఃఖం లేకపోవడమే నిజమైన సంతోషం.
- గొప్పల కోసం జీవించొద్దు గొప్ప లోకాలు పొందడం కోసం జీవించండి. అందుచేత తెలుసుకోండి,
- కోట్లు ఉన్నవాడు ధనవంతుడు కాదు, తృప్తి ఉన్నవాడే నిజమైన ధనవంతుడు.

# అందరిని ఇష్టపడే వాడే అందరికీ ఇష్టుడు అవుతాడు

మీరు గత కొన్ని రోజులుగా మీ జీవితాన్ని లోతుగా ప్రభావితం చేసే ముఖ్యమైన విషయాలను తెలుసుకుంటున్నారు. ఇవి సాధారణ విషయాలు కావు, మీ జీవితంలో గొప్ప మార్పులు తీసుకురాగల విషయాలు. మీ జీవితం మారడానికి అవసరమైన విషయాలను మీరు గమనించకపోవడం వల్లే ఆధ్యాత్మికంగా ఎదగలేకపోతున్నారు. కానీ ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, ఈ సత్యాలను కేవలం వినడం చేస్తే సరిపోదు ఆచరణలో పెట్టాలి.

ఇప్పుడు ఇంకొక సందేశం తెలుసుకుందాం:

**"అందరిని ఇష్టపడే వాడే అందరికీ ఇష్టుడు అవుతాడు"**

ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందుకంటే? ఎవరైనా సరే "అందరూ నన్ను ఇష్టపడాలి" అని అనుకుంటారు. కానీ నిజానికి, అందరూ నిన్ను ఇష్టపడాలంటే ముందు నువ్వు అందరినీ ఇష్టపడాలి. నువ్వు ఎవరినైతే ఇష్టపడతావో, వారు కూడా నిన్ను ఇష్టపడతారు.

మరి "అందరూ నిన్ను ఎందుకు ఇష్టపడరు?" అంటే నువ్వు ఇంకా అందరినీ ఇష్టపడటం లేదు కాబట్టి.

ఒకసారి ఒక మాస్టర్, పత్రి గారిని అడిగాడు "మన సొసైటీలో చూస్తే, ఒక మాస్టర్‌కు ఇంకో మాస్టర్ పడదు, ఒకరిని ఒకరు విమర్శించు కుంటారు, ఒకరు చేసే పని ఇంకొకరికి నచ్చదు. ఎక్కడ చూసినా ఇదే కనిపిస్తోంది. కానీ అందరూ మిమ్మల్ని ఇష్టపడుతున్నారు, దీనిలోని రహస్యం ఏమిటి?" అని అడిగాడు.

అప్పుడు పత్రి గారు చాలా సింపుల్‌గా చెప్పారు, "ఏమీ లేదు బాబు నేను అందరినీ ఇష్టపడుతున్నాను." ఇదే అసలు రహస్యం. అంటే మీరు అందరినీ ఇష్టపడటం ప్రారంభించినప్పుడు, మీలో ద్వేషం తగ్గిపోతుంది, ద్వేషం తగ్గిన చోట ప్రేమ పెరుగుతుంది. మీలో ప్రేమ ఉన్నప్పుడు, అది సహజంగా

బయటకు వ్యక్తమవుతుంది. అప్పుడు మీ చుట్టూ ఉన్నవారు కూడా మీ వైపు ఆకర్షితులవుతారు. అందుకే అందరూ నన్ను ఇష్టపడుతున్నారు. ఇందులో ప్రత్యేకమైన రహస్యం ఏమీ లేదు అని ఆయన చెప్పారు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఉంది. పత్రి గారు చెప్పిన ఆ సూత్రాన్ని అర్థం చేసుకోకపోవడం, ఆచరించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఆ సూత్రం ఏమిటంటే **"నో కామెంట్ -- నో జడ్జిమెంట్"** అంటే ఎవరినీ విమర్శించకండి, ఎవరిపైనా నిర్ణయాలు తీసుకోకండి. "వాడు ఇలా, వీడు అలా" అని తేల్చి చెప్పకండి. ఇది వినడానికి సులభంగా అనిపించినా, ఆచరణలో చాలా కష్టం.

ప్రపంచంలో ఎక్కడైనా ఇద్దరు లేదా ముగ్గురు కలిసి కూర్చుంటే, వారి సంభాషణలో ఎక్కువ భాగం ఇతరులను విమర్శించడం మీదే ఉంటుంది. వారి లోపాలు, తప్పులు, చెడు లక్షణాలు ఇవే చర్చకు వస్తాయి. అలా ఎందుకు జరుగుతుంది? దానికి ప్రధాన కారణం మీలో లోపాలు ఉండడం వల్లనే ఇతరులలో లోపాలు కనిపిస్తాయి.

అందుకే ''వాడు అలాంటోడు, వీడు ఇలాంటోడు'' అని మాట్లాడుతుంటారు. కానీ, మీలో లోపాలు లేకపోతే, ఎదుటి వారిలో లోపాలు కనిపించవు, అప్పుడు విమర్శించాలనే ఆలోచనే ఉండదు.

అందుకే "నో జడ్జిమెంట్" అని చెప్పారు ఎవరి గురించి నిర్ణయాలు తీసుకోకండి. అయితే, చాలా మంది వాదనలు, చర్చలు మొదలుపెడతారు, "షిరిడీ బాబా గొప్పవాడా? సత్య సాయిబాబా గొప్పవాడా?" "జీసస్ గొప్పవాడా? మహమ్మద్ గొప్పవాడా?""రాముడు గొప్పవాడా? శివుడు గొప్పవాడా?" అని.

ఇలాంటి చర్చలు జరుగుతూనే ఉంటాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే లక్షలాది శిష్యులు ఉన్న గొప్ప గురువులు కూడా కొన్నిసార్లు ఇలాంటి విమర్శలు చేస్తారు.

ఇటువంటి ప్రవర్తనకు ప్రధాన కారణం  వారిలో ఉన్న అజ్ఞానం. మీరు **“నో కామెంట్ -- నో జడ్జిమెంట్”** అనే ఈ రెండు విషయాలను ఆచరించగలిగితే, మీరు అపారమైన జ్ఞానం సంపాదించిన వారిలో ఒకరిగా పరిగణించబడతారు.

అయితే, మీరు ఈ రెండు విషయాలను పాటించట్లేదంటే, మీరు ఇంకా సరైన జ్ఞానం పొందనట్టే లెక్క. మీరు ఎంత కష్టపడుతున్నా, ఎంత ధ్యానం చేస్తున్నా, ఎన్ని పుస్తకాలు చదువుతున్నా, ఎన్ని క్లాసులు చెబుతున్నా, ఎన్ని క్లాసులకు వెళ్తున్నా ఇంకా సరైన జ్ఞానం లభించలేదని అర్థం చేసుకోవాలి.

అయితే, నిజమైన జ్ఞానం అంటే ఏమిటి? ఈ కనిపించే ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదని తెలుసుకోవడం. ఈ కనిపించే దేహాలు నిజంగా వారు కాదని గ్రహించడం. అందరూ కనిపించని ఆత్మలే, అందరూ ఒక్కటే, ఈ అవగాహన మీలో పూర్తిగా ఎప్పుడైతే కలుగుతుందో అప్పుడే మీరు నిజమైన జ్ఞానం పొందినట్లు. అన్నీ ఒకటేనని తెలుసుకున్నప్పుడు, మీరు ఎవరిని విమర్శిస్తారు?

అందులో ఎవరు ఎక్కువ? ఎవరు తక్కువ? అందరూ ఒకటే కదా? అందరూ సమానమే కదా? దేహం లోపల ఉన్న ఆత్మను మీరు చూడగలిగితే, అందరూ ఒకటే అన్న సత్యం మీకు స్పష్టంగా తెలుస్తుంది.

కానీ, మీరు ఇంకా విమర్శిస్తున్నారంటే మీరు ఇంకా దేహాన్నే చూస్తున్నారనే లెక్క. దేహాన్ని చూస్తేనే తేడాలు కనిపిస్తాయి. స్త్రీ  పురుషుల తేడా, ధనవంతుడు  పేదవాడు అనే తేడా, గొప్ప కులం  తక్కువ కులం అనే తేడా, “వాడు మన వాడు కాదు” అనే భావనలు వస్తాయి. “వాళ్ళది వేరే మతం, వేరే కులం నేను వేరు” అనే అభిప్రాయాలు ఏర్పడతాయి.

ఇలా ఎందుకు జరుగుతుంది? ఎందుకంటే  ఆ జ్ఞానం ఇంకా కలగలేదు. ఒక్కసారి ఆలోచించండి మీ మాటల్లో, మీ ఆలోచనల్లో, మీ

ప్రవర్తనలో ఇవి ఇంకా ఉంటే, మీరు ఇంకా ఎంత మార్పు చెందాల్సి ఉందో అర్థం చేసుకోండి.

ఇంటి విషయానికి వస్తే ఇంట్లో భర్తను ద్వేషించే వారు చాలామంది ఉన్నారు, భార్యను ద్వేషించేవారు వున్నారు. ఇలాంటి పరిస్థితిలో బయట క్లాసులు చెప్పడం ఎవరి కోసం? ముందు మీ ఇంట్లోనే ప్రవర్తన మార్చుకోవాలి. ఇంట్లో మార్పు రాకపోతే, బయట ఎక్కడ మార్పు వస్తుంది? అందుకే, మీరు ఇంకా మీ జ్ఞాన స్థాయి ప్రాథమికంగానే ఉందని గుర్తించాలి.

ఇంట్లో ఉన్న భర్తను ఆత్మగా చూడగలిగినప్పుడు, ఇంట్లో ఉన్న భార్యను ఆత్మగా చూడగలిగినప్పుడు అప్పుడు మీరు జ్ఞాన పరంగా నిజంగా ఎదిగినట్టే. కొందరు ఇలా ప్రశ్నిస్తారు: "అయితే భార్యను భార్యగా అనుకోకపోతే, కాపురం ఎలా చేస్తాం?" "పనివాడిని పనివాడిగా చూడకపోతే, పని ఎలా చేయించుకుంటాం?" ఇవి తెలివైన ప్రశ్నల్లా అనిపించినా, ఇవి ఇంకా దేహ దృష్టిలోనే ఉన్న ఆలోచనలు.

ఇలాంటి వాళ్ళ కోసమే వశిష్టులు వారు ఏం చెప్పారంటే **"బాహ్యంలో ద్వైతము, అంతరంలో అద్వైతము పాటించాలి"** అని. బాహ్యంగా అన్ని విషయాలు భార్యే కానీ అంతరంలో ఆవిడ ఆత్మే. "ఆమె ఆత్మే... నేనూ ఆత్మనే" ఈ భావంతోనే జీవించాలి.

అందుకే భార్యను ప్రేమించాలి, ద్వేషించకూడదు. భర్తను ప్రేమించాలి, ద్వేషించకూడదు. వారి లోపాలను చూడకూడదు, విమర్శలు చేయకూడదు. ఇద్దరిలోనూ ఈ అవగాహన ఉంటే, సంసారం సుఖంగా ఉంటుంది. కానీ, చాలా కుటుంబాలలో ఈ అవగాహన ఉండదు. అయినా సరే ఎదుటి వారికి అవగాహన లేకపోయినా, మీకు జ్ఞానం వచ్చిందంటే, మీ ప్రవర్తన మాత్రం మారాలి, మీరే మారాలి.

ఈ విషయం ఎంతో స్పష్టంగా భగవద్గీతలో చెప్పబడింది .

**శ్లో॥ విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తినిః**
**శుని చైవ శ్వపాకేచ పణ్డితాః సమదర్శినః (భ.గీ.5-18)**

తా: విద్య, వినయము కలిగిన బ్రాహ్మణుడు గోవు, ఏనుగు, కుక్క, మాంసము వండుకుని తినే చండాలుడు, వీరందరిపట్ల సమ దృష్టికలిగినవాడే పండితుడు.

ఇక్కడ “పండితుడు” అంటే పుస్తకాలు చదివినవాడు కాదు, జ్ఞానంలో పండినవాడు. అతనికి సత్యం స్పష్టంగా తెలుసు, కుక్కలో ఉన్నది, ఏనుగులో ఉన్నది, ఆవులో ఉన్నది, బ్రాహ్మణుడిలో ఉన్నది, చండాలుడిలో ఉన్నది ఒకటే ‘ఆత్మ’. ఈ సత్యాన్ని గ్రహించినవాడు అందరిని సమంగా చూస్తాడు, అతడే నిజమైన పండితుడు. ఈ స్థాయికి వచ్చినవాడు అందరినీ ఇష్టపడతాడు. ఎందుకంటే, అతనికి తెలుసు శరీరాలు వేరు వేరు కానీ అందరిలోనూ ఉన్నది ఒకటే ‘ఆత్మ’ అని.

అప్పుడు ఎవరిని ద్వేషిస్తాడు? ఎవరిపైన అసూయ పడతాడు? ఎవరిని తక్కువగా చూస్తాడు? అందుకే, అతను అందరినీ ప్రేమిస్తాడు. ఎవరిని చూసినా వారి రూపం కాదు, వారి లోపల ఉన్న ‘ఆత్మే’ అతనికి కనిపిస్తుంది.

ఇలాంటి దృష్టి నేను పత్రి గారిలో స్పష్టంగా గమనించాను. ఇక్కడ మీకు ఒక సందేహం రావచ్చు “ఇలాంటి మహానుభావులను ఎవరూ విమర్శించరా?” అని అనచ్చు.

బుద్ధుడిని కూడా విమర్శించినవారు ఉన్నారు, ఆయనకు దగ్గర వారే ఆయనను అవమానించిన సందర్భాలు ఉన్నాయి. అయితే, ఒక విషయం గుర్తుంచుకోండి, వాళ్ళు వీరిని విమర్శిస్తారు కానీ, వీరు వాళ్ళను విమర్శించరు. ఎందుకంటే వాళ్ళు ఇంకా అజ్ఞానంలో ఉన్నారని వీరికి తెలుసు. అందుకే, వారు పట్టించుకోరు.

ఒకసారి పత్రిగారిని టివి-9 వారు తీవ్రంగా విమర్శించినప్పుడు,

కొంతమంది స్పందించడానికి సిద్ధపడ్డారు. "మేము వాడి సంగతి చూస్తాం, మేము సమాధానం ఇస్తాం," అని ముందుకొచ్చారు.

కానీ, పత్రి గారు వారిని ఆపారు. ఆయన చాలా స్పష్టంగా "వారు ఏమి చేస్తారో చేసుకోనివ్వండి, మీరు మాత్రం ఏమీ మాట్లాడకండి. కొంతకాలం మనం నిశ్శబ్దంగా ఉండిపోదాం, ఎన్ని రకాలుగా విమర్శిస్తారో వారిని విమర్శించుకోనివ్వండి, అని చెప్పారు.

ఆయన ఎందుకు అలా చెప్పారు? విమర్శించే వ్యక్తి ఎవరో బయట వాడు కాదు. అతడూ ఆత్మే కానీ, అజ్ఞానం వల్ల అలా ప్రవర్తిస్తున్నాడు ఇది పత్రిగారికి స్పష్టంగా తెలుసు.

ఇంకో ముఖ్యమైన విషయం కూడా ఉంది. ఎవరు ఏం చేసినా ప్రకృతి నిశ్శబ్దంగా గమనిస్తుంది, ప్రతి పని రికార్డు చేస్తుంది. సమయం వచ్చినప్పుడు, వాడు ఎంత గొప్పవాడైనా దానికి తగిన ప్రతి ఫలాన్ని ఆ వ్యక్తి అనుభవించాల్సిందే. అందుచేత ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే, ఆ ఫలితాన్ని తప్పకుండా అనుభవిస్తారు. అందుచేత మీరు ఎందుకు ప్రతిస్పందించాలి? అందుకే పత్రి గారు వారిని వదిలేస్తారు.

ఎవరో మన గురించి చెడ్డగా మాట్లాడితే, మనమూ తిరిగి మాట్లాడితే మన పేరుమీద కూడా కొత్త కర్మ నమోదు అవుతుంది. అంటే మీరు మీ కర్మను మీరే సృష్టించుకుంటున్నారు. అయితే మీరు ఎందుకు మీ కర్మను పెంచుకోవాలి?

ఒకసారి దేవదత్తుడు ఎన్నో విధాలుగా బుద్ధుణ్ణి హాని చేయడానికి ప్రయత్నించాడు, అయినా, బుద్ధుడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. శిష్యులు ఎంత చెప్పినా, ఆయన స్పందించలేదు. ఒక సందర్భంలో దేవదత్తుడు ఒక పిచ్చెక్కిన ఏనుగును బుద్ధుడు ఉన్న ఆశ్రమంలోకి వదిలాడు. ఆశ్రమంలో ఆ ఏనుగు తీవ్రంగా అల్లకల్లోలం సృష్టించింది, ఆశ్రమంలోని పర్ణశాలలు ధ్వంసం

చేసింది, అందరినీ భయపెట్టి పరుగులు తీయించింది. చివరికి, ఆ ఏనుగు బుద్ధుడి దగ్గరకు వచ్చి ప్రశాంతంగా కూర్చుంది.

అప్పుడు శిష్యులు ఆశ్చర్యంతో అడిగారు "ఇంత దారుణంగా ప్రవర్తిస్తున్నప్పటికీ, మీరు ఎందుకు స్పందించడం లేదు? ఇప్పటికైనా ఏమైనా చర్య తీసుకుంటారా? అన్నారు. అప్పుడు బుద్ధుడు ప్రశాంతంగా ఇలా అన్నారు "ఆవేశపడకండి ఏదో జన్మలో నేను అతనికి బాధ కలిగించి ఉండవచ్చు, అందుకే ఇప్పుడు అతను ఇలా ప్రవర్తిస్తున్నాడు, ఇప్పుడు నేను కూడా స్పందిస్తే, నా కర్మను నేను మళ్ళీ పెంచుకున్నట్టే అవుతుంది" అన్నారు.

"ఈ ఏనుగుకు నేను ఎప్పుడో ఉపకారం చేసి ఉండవచ్చు. అందుకే అది నన్ను హాని చేయకుండా, నా దగ్గరకు వచ్చి కూర్చుంది" అన్నాడు.

కుటుంబంలో కూడా ఇలాంటి పరిస్థితులు రావచ్చు. కానీ, జ్ఞానం పొందిన మీ ప్రవర్తన మాత్రం భిన్నంగా ఉండాలి, మీలో స్పష్టమైన మార్పు కనిపించాలి.

అందుకే గుర్తుంచుకోండి **"అందరినీ ఇష్టపడే వాడే అందరికీ ఇష్టుడు అవుతాడు."** మరి అందరినీ ఎవరు ఇష్టపడగలరు? జ్ఞానం ఉన్నవాడే. జ్ఞానం అంటే ఏమిటి? అందరూ ఒకటే అని తెలుసుకోవడం.

పత్రి గారు చెప్పారు, "ఈ ప్రయాణం ఎప్పటి వరకు సాగుతుందంటే? **"అంతా నేనే... నేనే అంతా' అనే స్థితికి చేరే వరకు."** అప్పుడు మిమ్మల్ని అందరు ఇష్టపడతారు.

# “కాలం చాలా విలువైనది, కాలాన్ని ఎప్పుడూ వృథా చేయకూడదు.”

మీరు గత కొన్ని రోజులుగా ముఖ్యమైన విషయాలను మాట్లాడుకుంటూ వస్తున్నాం. ఈ విషయాలను ప్రతి ఒక్కరూ ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. అవి కేవలం వినడం లేదా తెలుసుకోవడం మాత్రమే కాకుండా, బాగా అర్థం చేసుకుని జీవితంలో ఆచరించడానికి ప్రయత్నం చేయాలి. ఈ ఆచరణ క్రమంగా సహజంగా మారాలి. “సహజం” అంటే గుర్తుంచుకుని చేయడం కాదు, గుర్తొచ్చినప్పుడు మాత్రమే చేయడం కాదు. మీ ప్రవర్తన, మీ జీవన విధానం సహజంగానే జ్ఞానానికి అనుగుణంగా ఉండాలి.

అలా జీవించడం ప్రారంభమైనప్పుడు, ఆధ్యాత్మికంగా మీకు ఎలాంటి అడ్డంకులు ఉండవు. మీరు చాలా వేగంగా, అంచలంచలుగా ఎదుగుతూ ఉంటారు. మీరు ఎదిగే కొద్దీ మీ జ్ఞానం మరింత పెరుగుతుంది. జ్ఞానం పెరిగే కొద్దీ మీ జీవితంలో దుఃఖం తగ్గిపోతుంది.

అంతేకాకుండా, మీరు ఇతరులకు కూడా ఆదర్శంగా మారతారు. మీ జీవితం మాత్రమే కాదు, మీ ద్వారా ఎంతో మంది జీవితాల్లో మార్పులు కూడా మీరు తీసుకురాగలుగుతారు. ఇప్పుడు మీరు ఎదగడం లేదని అనిపిస్తే, దానికి కారణం ఎక్కడో లోపం ఉండటమే. అంటే, మీరు ఇప్పటికే తెలుసుకున్న విషయాలలో కొన్ని మీరు ఆచరించడం లేదని అర్థం.

అందుకే ఇప్పుడు ఆ ముఖ్యమైన విషయాలను ప్రత్యేకంగా చెప్పడం జరుగుతోంది. ఎవరు ఈ జ్ఞాన మార్గంలో త్వరగా ఎదగాలని కోరుకుంటారో, వారు ఈ విషయాలను నిజంగా ఆచరించే ప్రయత్నం చేయాలి.

ఇప్పుడు ఇంకొక ముఖ్యమైన సందేశం చెప్పుకుందాం.

**“కాలం చాలా విలువైనది, కాలాన్ని ఎప్పుడూ వృథా చేయకూడదు.”**

ఈ విషయాన్ని నేను పత్రి గారి దగ్గర నుంచి నేర్చుకున్నాను, ఆయనను చూసిన తరువాత ఈ అవగాహన నాకు వచ్చింది. ఎందుకంటే ఆయన ఒక నిమిషం కూడా వృథా చేసేవారు కాదు. రాత్రి చాలా ఆలస్యంగా పడుకున్నా, ఉదయం చాలా తొందరగా లేచేవారు. నిద్ర లేచినప్పటి నుంచి ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండేవారు కాదు. ఎప్పుడూ ఏదో ఒక మంచి పని చేసుకుంటూ ఉండేవారు. అలా ఆయన ఎన్నో జ్ఞానవంతమైన పుస్తకాలు వ్రాశారు. ప్రతి నెల తెలుగు, ఇంగ్లీష్ మ్యాగజైన్స్ వెలువడేలా ఎంతో కృషి చేసేవారు.

అంటే, ఆ మ్యాగజైన్స్ ద్వారా మన అందరికీ మంచి అవగాహన కలగాలని ఆయన ఎంతగానో శ్రమించారు. ఆయన చేసిన ఆ కృషి ఫలితంగానే మనమంతా ఈ రోజు ఈ స్థాయిలో ఎదగడానికి అవకాశం పొందాము. అలాగే ఆయన ఎంతో మంది మాస్టర్లతో నిరంతరం సంభాషించేవారు. వారి సందేహాలను ఓపికగా విని క్లియర్ చేసేవారు. వారిని ఉత్తేజపరుస్తూ, ప్రోత్సహిస్తూ ఉండేవారు.

ఎందుకంటే ఆయన అనుసరించే వారు కేవలం ఆంధ్ర, తెలంగాణలో మాత్రమే కాదు  కర్ణాటక, తమిళనాడు, నార్త్ ఇండియా, విదేశాలలో కొన్ని వేల మంది మాస్టర్లు ఉండేవారు, ఆయనను అనుసరిస్తూ ఉండేవారు. వారితో సంభాషించడం ఎవరు ఏ పని చేయాలో వారికి పురమాయిస్తూ, వారిని కూడా ప్రోత్సహిస్తూ వారిని ఇంకా మంచి మాస్టర్లుగా తయారు చేయడానికి కృషి చేసేవారు. అదేవిధంగా ప్రతిరోజూ ఏదో ఒక రాష్ట్రంలో, ఎన్నో జిల్లాలు, గ్రామాలు తిరుగుతూ ఉండేవారు. అక్కడి మాస్టర్లను ఉత్తేజపరుస్తూ, ఈ జ్ఞాన మార్గంలో ముందుకు నడిపించేవారు.

మొదట నేను అనుకునే వాడిని అస్తమాను ఎందుకు ఇలా తిరుగుతారు?" అని. కానీ తర్వాత నాకు అర్థమైంది. ఆయన బ్రహ్మ జ్ఞాని. ఆయనకు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. కానీ మిగతా వారు జ్ఞానులు

కావడానికి ఆయన ఈ విధంగా కృషి చేస్తున్నారు, అందుకే ఇలాంటి గురువు యొక్క ప్రోత్సాహం చాలా అవసరం.

ఈ ప్రయాణాల్లో కూడా ఆయన ఖాళీగా ఉండేవారు కాదు. కారులో కూర్చున్నా, ప్రయాణిస్తున్నప్పుడే ఎవరితోనో మాట్లాడటం, ఏదో పనిని చెప్పడం చేసేవారు. ఎవరి ఇంటికి వెళ్తే, అక్కడ కూడా మ్యాగజైన్స్ చూడటం వంటి పనులు చేసేవారు. ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా కష్టపడి పని చేసేవారు. ఒకసారి తిరిగి వచ్చేసరికి రాత్రి తొమ్మిది, పది అయ్యేది. అలసటతో వాలిపోయేవారు.

ఒకటి రెండు సార్లు మా ఇంటికి వచ్చినప్పుడు కూడా నేను ఆయన ఎంత కష్టపడుతున్నారో స్వయంగా చూసాను. అప్పట్లో నాకు అనిపించేది "ఎందుకు ఇంత కష్టపడుతున్నారు? హాయిగా కూర్చుంటే సరిపోదా? అంతటి గొప్ప వ్యక్తి ఒక ఆశ్రమంలో ఉంటే, శిష్యులే ఆయన దగ్గరకు వస్తారు కదా?" అని. కానీ తర్వాత నాకు అసలు నిజం అర్థమైంది. సాధారణ గురువులు శిష్యులకు బోధిస్తారు. కానీ పత్రి గారు మాత్రం తన శిష్యులను మాస్టర్లుగా తీర్చిదిద్దేవారు. అలా ఆయన ఎంతో మంది మాస్టర్లను తయారు చేశారు.

ఆయనను నేను గమనించిన తర్వాత నాకు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. సాధారణంగా చాలా గురువుల దగ్గర ఉన్న శిష్యులు జీవితాంతం శిష్యులుగానే ఉంటారు. కానీ పత్రి గారి దగ్గర ఉన్న శిష్యులు మాత్రం తక్కువ కాలంలోనే గురువులుగా ఎదుగుతారు. ఎందుకంటే ఆయన అలా ప్రోత్సహించేవారు, అలా తీర్చిదిద్దేవారు. అయితే నాకు ఒక సందేహం ఉండేది "ఎందుకు ఆయన ఇంతలా కష్టపడుతున్నారు?" అని. ప్రతి విషయాన్ని నేను లోతుగా ఆలోచించేవాడిని.

తర్వాత నాకు అర్థమైంది ఆయనకు కాలం విలువ బాగా తెలుసు. సమయం ఎంత అమూల్యమో ఆయన పూర్తిగా గ్రహించారు. ఈ జన్మలో ఆయనకు లభించిన ప్రతి క్షణాన్ని ఎందుకు వృథా చేయాలి అని భావించి,

దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసేవారు. నాకు అనిపించేది పత్రి గారు పది జన్మల్లో చేసే పనిని ఒకే జన్మలో చేస్తున్నారు అని. కానీ కొంతమంది మాత్రం ఒక జన్మలో చేయాల్సిన పనిని పది జన్మలు తీసుకుని చేస్తారు. ఎంత తేడా ఉందో చూడండి!

వారికి కాలం విలువ తెలుసు, అందుకే వృథా చేయరు. మనకు ఇవ్వబడిన సమయాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలి, అలా చేయగలిగిన వాడే నిజమైన మాస్టర్, ఇదే నాకు ఆదర్శంగా మారింది, ఆయనను చూసి నేనూ నేర్చుకున్నాను. ఇంతటితో కాదు 24 సంవత్సరాల క్రితం పత్రి గారి పరిచయం నాకు జరిగింది. అప్పటి వరకు ఈ ముఖ్యమైన విషయాల గురించి నాకు పెద్దగా అవగాహన లేదు, అందరి లాగే నేనూ జీవించాను, అందరూ వేటికి ప్రాముఖ్యత ఇస్తే, నేనూ అవే విషయాలకు ప్రాముఖ్యం ఇస్తూ ఉండే వాడిని. ఆ సమయంలో నా భావం ఏమిటంటే "దేహమే నేను" అనే అవగాహన మాత్రమే. జన్మ తీసుకుంటాం, కొన్నాళ్లు జీవిస్తాం, తర్వాత నిష్క్రమిస్తాం, ఉన్నంత కాలం గొప్పగా జీవించాలి, సుఖంగా జీవించాలి, అందరికంటే గొప్పగా ఉండాలి,ఎంత డబ్బు ఉంటే అంత గౌరవం, అంత విలువ వస్తుందని నేను అనుకునేవాడిని.

కానీ 24 సంవత్సరాల క్రితం పత్రి గారి ద్వారా నాకు ఒక గొప్ప సత్యం తెలిసింది "నేను దేహం కాదు. నేను ఆత్మను" అనే విషయం. ఆ విషయం నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. నా దగ్గర ఒక మంచి లక్షణం ఏమిటంటే గొప్పవాళ్లు ఏదైనా చెప్పిన వెంటనే అర్థం కాకపోయినా, దాన్ని నిర్లక్ష్యం చేయకుండా, దాని గురించి ఆలోచించేవాడిని. "ఇలా ఎందుకు చెప్పారు?" అని ఆలోచించేవాడిని.

పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, గొప్పవారి సందేశాలు వినడం మాత్రమే కాదు, వాటిని లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించాను. అలా ఆయన చెప్పింది నిజమే అని నాకు స్పష్టంగా అర్థమైంది. అప్పుడు నా

ఆలోచనల్లో మార్పు వచ్చింది. 53 సంవత్సరాల వరకు నేను నమ్మింది ఒకటి, ఇప్పుడు పత్రి గారు చెప్పింది ఇంకొకటి. ఇంతకాలం "నేను దేహం" అని భావిస్తూ జీవించిన జీవితంలో "నువ్వు దేహం కాదు" అని చెప్పినప్పుడు అది ఎంత పెద్ద మార్పో మీరు ఊహించండి. అదే కాకుండా, "నేను ఎవరు?" అనే ప్రశ్నకు "నువ్వు ఆత్మవు" అని ఆయన స్పష్టంగా చెప్పారు.

దేహం కనిపిస్తుంది, కానీ ఆత్మ కనిపించదు. దేహం అశాశ్వతం, ఆత్మ శాశ్వతం. "దేహమే నేను" అనే భావన తప్పు అని అర్థమైంది."నువ్వు ఆత్మవు" అనే సందేశం నాకు స్పష్టంగా తెలిసింది.

"ఆత్మ కోసం ఈ దేహం మనకు ఇవ్వబడింది, అంతేకాని దేహం కోసం ఆత్మ కాదు". అని నాకు అర్థమైంది. రమణ మహర్షి వంటి మహానుభావుల జీవితాలు చదివినప్పుడు ఈ సత్యం మరింత స్పష్టమైంది.

దేహం ఆత్మను తీసుకురాలేదు, ఆత్మే ఈ దేహాన్ని తీసుకుంది అంటే తొడుక్కుంది. ఎవరైతే ఈ దేహాన్ని సరిగా ఉపయోగించుకుంటారో, వారు నిజంగా గొప్పవారవుతారు. ఒక సత్యం తెలిసిన తర్వాత, ఇంకా ఎన్నో విషయాలు వరుసగా అర్థమయ్యాయి. ఈ ఇహ లోక జీవితం మాత్రమే కాదు, పర లోక జీవితం కూడా ఉందని తెలుసుకున్నాను.

మన జీవితం ఇక్కడ మాత్రమే కాదు ఆ తర్వాతి జీవితం కూడా మంచిగా ఉండాలి. మొదట ఆయన పరిచయం అయినప్పుడు, ఆయన చెప్పిన తర్వాత "నేను ఆత్మను" అని నిశ్చయించుకున్నాను. అప్పుడు నాకు 53 సంవత్సరాలు. ఆ 53 సంవత్సరాలు కూడా నేను పూర్తిగా దేహం కోసమే జీవించాను. నా సమయం, నా శక్తి అన్నీ దేహం కోసమే ఖర్చు పెట్టాను. ఆయన పరిచయం అయిన తర్వాతే నాకు అర్థమైంది ఈ దేహం నేను కాదు. కొన్నాళ్ళకు ఇది వదిలేయాల్సిందే, ఇది బూడిదైపోతుంది. కానీ ఆత్మ అయిన నేను శాశ్వతంగా ఉంటాను అని.

అప్పుడు నాకు ఒక ప్రశ్న వచ్చింది ఆత్మ కోసం నేను ఏం చేయాలి?

ఆత్మ లాభం కోసం నేను ఏం కృషి చేయాలి? ఆత్మ లాభం అంటే అసలు ఏమిటి? ఈ దేహం వదిలిన తర్వాత ఈ ఆత్మ ఎక్కడికి వెళ్తుంది? ఈ ప్రశ్నలన్నీ నాలో బలంగా వచ్చాయి. వాటిపై నేను లోతుగా ఆలోచించాను. ఇంతకుముందు నేను దేహ లాభం కోసం ధనం సంపాదించాను. కానీ ఇప్పుడు నేను దేహం కాదు ఆత్మను అని అర్థమైంది. ఆత్మ కోసం సంపాదించాల్సింది "జ్ఞానం" అని తెలుసుకుని నేను జ్ఞాన సంపాదన ప్రారంభించాను. ఆ సమయంలో నాకు ఒక సందేహం వచ్చింది.

మా ఇంట్లో మా నాన్నగారి అన్నదమ్ములు ముగ్గురూ 60 సంవత్సరాల లోపే శరీరాన్ని వదిలారు. మా నాన్నగారు కూడా 56 సంవత్సరాలకే శరీరాన్ని వదిలారు. అది మా కుటుంబంలో ఆనవాయితీలా జరుగుతుందేమో అని నేను భయపడ్డాను. నేను ఈ మార్గంలోకి వచ్చినప్పుడు వారిలో ఎవరూ లేరు. ఈ విషయం గుర్తుకు వచ్చే సరికి నాకు చాలా భయం వేసింది.

ఎందుకంటే నా జీవితమంతా నశించిపోయే దేహం కోసం ఖర్చు పెట్టాను. ఇప్పుడు మాత్రమే నాకు ఈ జ్ఞానం వచ్చింది. అయితే నా జీవితంలో ఇంకా ఎంత సమయం మిగిలి ఉందో తెలియదు. ఇంత తక్కువ సమయంలో నేను ఈ జ్ఞానాన్ని ఎలా సంపాదించగలను అని నేను ఆందోళన చెందాను. ప్రకృతి ఇచ్చిన సమయమంతా నేను దేహం కోసమే వాడుకున్నాను.
ఇప్పుడు మిగిలిన ఈ కొద్ది సమయంలో నేను ఏమి చేయగలను అని భయపడ్డాను. అప్పుడు నేను ఈ విషయం గురించి పత్రి గారిని అడిగాను. "మీ పరిచయం నాకు పది సంవత్సరాల క్రితమే జరిగి ఉంటే ఎంత బాగుండేది" అని అన్నాను. అప్పుడు ఆయన నవ్వుతూ చెప్పారు "అయిపోయిందేదో అయిపోయింది, ఇప్పుడు ఉన్న సమయాన్ని సరిగ్గా ఉపయోగించుకో" అని.

నేను కూడా సమయాన్ని వృథా చేయకుండా వచ్చిన అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలి అనే నిర్ణయానికి వచ్చాను. "ఇక్కడి నుంచైనా

నువ్వు జాగ్రత్త పడు" అని ఆయన చెప్పారు. ఇప్పుడు ఇక నా సమయం వృథా చేయకూడదు అని అర్థమైంది. ఎంత జీవితాన్ని వృథా చేశానో అనిపించింది, నేను ఏమాత్రం ఉపయోగం లేకుండా, నిరుపయోగంగా జీవించాను. నేను చేసినవి, సాధించినవి అన్నీ వృథానే.

ఒక్కటి కూడా ఆత్మకు లాభం కాదు. ఇది ఆలోచించగా నాకు చాలా బాధ కలిగింది. అప్పుడు నేను నిశ్చయించుకున్నాను నా సమయాన్ని అసలు వృథా చేయకూడదు, నాకు ఉపయోగపడని ధన సంపాదనకు ఖర్చు పెట్టకూడదు అని నిర్ణయించుకున్నాను. అందుకే నా వ్యాపారాలన్నీ వదిలేశాను. ఇంకేం సంపాదిస్తాను? ఇంకేం పెంచుతాను? చివరికి పిల్లలకి నిల్వ చేసి ఇవ్వడమే కదా!

అలాగే వారు కూడా సంపాదించుకోవాలి కదా? వాళ్ళకి నేను నిల్వ చేసి ఇవ్వాలా? నేను ఎలా నా జీవితంలో కష్టపడి సంపాదించుకున్నానో, వాళ్ళు కూడా అలాగే కష్టపడి వాళ్ళ జీవితంలో సంపాదించుకోవాలి అని నిర్ణయించి వాళ్ళ గురించి కష్టపడడం అక్కడి నుంచే ఆపేశాను. వాళ్ళకి ఇవ్వాల్సింది ఇచ్చి చెప్పాను "మీ బ్రతుకు మీరు బ్రతకండి నా జీవితం నేను జీవిస్తాను" అన్నాను.

అదృష్టవశాత్తూ మా మేడం కూడా నన్ను అర్థం చేసుకుంది. ఆమె కూడా ఈ మార్గంలోకి వచ్చింది. భీమవరం మూడు రోజుల క్లాసుల వల్ల ఆమెకు కూడా ఆసక్తి వచ్చింది, అక్కడ మాట్లాడడం ప్రారంభించింది. పత్రి గారు కూడా ఆమెను ప్రోత్సహించడంతో, ఆమె పూర్తిగా ఇందులో ఇన్వాల్వ్ అయింది. ఆమె నాకంటే ఎక్కువ కష్టపడేది, ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండటానికి ఇష్టపడేది కాదు.

అప్పుడు నాకు సమయం విలువ అర్థమైంది. "నేను ఆత్మను" అని తెలుసుకున్న తర్వాత, సమయం ఎంత విలువైందో నాకు స్పష్టంగా తెలిసింది. ఆత్మ కోసం ఈ జన్మ తీసుకున్నాం. ఈ శరీరం కూడా ఆత్మ కోసమే వచ్చింది.

కానీ ఈ సమయాన్ని అంతా శరీరం కోసం ఖర్చు పెడితే, ఆత్మకు ఎంత నష్టం చేస్తున్నామో అర్థమైంది.

ఇంతకు ముందు ధన సంపాదన కోసం రాత్రింబవళ్ళు కష్టపడ్డాను. ఇప్పుడు జ్ఞాన సంపాదన కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నాను.

పత్రీజీ ఒక అద్భుతమైన సందేశం చెప్పారు "పంచింది పెరుగుతుంది." అదే నాకు ప్రేరణ అయింది. అందుకే నాకు ఇవ్వబడిన ఈ సమయాన్ని వృథా చేయకుండా, జ్ఞాన సంపాదనకి కేటాయించాను. జ్ఞానాన్ని పంచడం ఇదే నా పని అయిపోయింది.

మా ఇద్దరి పని ఏమిటంటే పుస్తకాలు వ్రాయడం, వ్రాయించడం, వీడియోల ద్వారా సందేశాలు ఇవ్వడం, ఇతరుల చేత కూడా ఈ పనులు చేయించడం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మేము తెలుసుకున్న జ్ఞానాన్ని పంచడం. ఎందుకంటే ఒక విషయం నేను ఎప్పుడూ మర్చిపోను ఇంకెంత కాలం ఉంటాం మనం? అందుకే రెస్ట్ లేకుండా, ఓపిక లేకపోయినా తిరుగుతూనే ఉన్నాను. ప్రయాణంలో ఉన్నా కూడా ఖాళీగా ఉండకుండా పని చేసేవాడిని. అక్కడే పుస్తకాలు వ్రాయడం, కరెక్షన్స్ చేసేవాడిని. అందుకే ఇన్ని పుస్తకాలు వచ్చాయి. చాలామంది అడుగుతారు "ఇంత తిరుగుతున్నా మీకు ఎక్కడ టైమ్ దొరుకుతుంది?" అని. కానీ ఆ తిరగడంలోనే ఇవన్నీ జరిగాయి.

ఈ మార్పు ఎందుకు వచ్చింది అంటే నేను ఆత్మను అని తెలుసుకోవడం వల్ల, ఆత్మకు కావలసింది జ్ఞానం అని అర్థం కావడం వల్ల. దేహం కోసం ఎంతో జీవితాన్ని వృథా చేశాను అని తెలుసుకుని, ఇక మిగిలిన జీవితాన్ని వృథా చేయకూడదు అని భావించాను. మీరు "ఇంకో జన్మ ఉంటుంది కదా?" అని అనుకోవచ్చు. కానీ ఇంకో జన్మ రావడానికి వందల సంవత్సరాలు పట్టొచ్చు, వేల సంవత్సరాలు పట్టొచ్చు. ఎటువంటి జన్మ వస్తుందో! అప్పుడు మనల్ని ఈ మార్గంలో నడిపించే గురువు దొరకుతాడో! దొరకడో! తెలియదు కదా?

పత్రి గారు ఒక విషయం చెప్పారు. అందరూ స్వామి వివేకానందని రామకృష్ణ పరమహంస శిష్యుడు” అని అనుకుంటారు. కానీ పత్రి గారు “వివేకానంద శిష్యుడే రామకృష్ణ పరమహంస” అని చెప్పారు. అంటే పై లోకాలలో ఉన్నప్పుడు, వివేకానంద ఈ ఆధ్యాత్మిక మార్గంలో తనకు బోధ చేయమని, ఆయన ముందుగానే రామకృష్ణ పరమహంసను పంపించారట. అలా రామకృష్ణ పరమహంస గారు పరిచయం అయ్యారు. ఆయన ద్వారా ఈ బోధలు, ఆయన ఆశయాలు ఇవన్నీ వివేకానంద గారు తెలుసుకుని ప్రపంచానికి అందించారు.

అప్పుడు నేను ఆలోచించాను ఆయన ఎందుకు అలా చేశాడు? ఎందుకంటే మీరు జన్మ తీసుకున్న తర్వాత, ఎక్కడ పుడతారో, ఎలాంటి వాతావరణంలో పెరుగుతారో మీకు గుర్తుండదు కదా? అలా అయితే జన్మ వృథా అయిపోతుందేమో అని, అలా వృథా కాకుండా ముందే ఏర్పాట్లు చేసుకున్నాడు.

అయితే నాకు ఒక సందేహం వచ్చింది అలా ముందే ఏర్పాట్లు చేసుకునే అవకాశం అందరికీ ఉంటుందా? లేకపోతే ఈ జన్మను వృథా చేసుకుని, ఇంకో జన్మలో చూసుకుందాం అనుకుంటే మన పరిస్థితి ఏంటి? ఎందుకంటే మీరు ఎక్కడ పుడతారో, ఎలాంటి కుటుంబంలో పుడతారో, ఇలాంటి గురువులు దొరుకుతారో! లేదో! తెలియదు. అయితే ఇప్పుడు దొరికిన అవకాశాన్ని వృథా చేసి,“తర్వాత చేస్తాను” అంటే అది ఎలా సాధ్యం?

అప్పుడు నాకు స్పష్టంగా అర్థమైంది ఇప్పుడున్న అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలి. అందుకే ఎప్పుడు నిష్క్రమిస్తామో తెలియదు అనే భావంతో, సమయాన్ని వృథా చేయకుండా జీవితాన్ని ఉపయోగించుకోవడం ప్రారంభించాను. ఇప్పటికీ మేమిద్దరం అదే చేస్తున్నాం.

అందుకే ఇవ్వబడిన సమయాన్ని వృథా చేయకుండా, కాలం చాలా విలువైనది అన్నది ప్రతి క్షణం గుర్తుండడం వల్ల, మేము ఇలా తిరుగుతూ ఈ

మార్గంలో పయనిస్తున్నాం. మా ద్వారా కొంత మందిని జ్ఞానులుగా చేయగలిగితే, మా జీవితం ధన్యమైనట్టే అదే మా ఉద్దేశం. ఈ జన్మలో జ్ఞానాన్ని నేర్చుకోవాలి, ఆ జ్ఞానాన్ని ఎంతో మందికి పంచాలి. మాలా కొంత మందిని తయారు చేయాలి, ఇదే మా ఆశయం. మాకు ఇవ్వబడిన సమయాన్ని ఈ విధంగా సద్వినియోగం చేసుకొంటున్నాం. ఈ మార్గంలో పయనించినవారు గొప్ప లోకాలకి చేరుకుంటారని తెలుసు, మరు జన్మ కూడా అనుకూలంగా వస్తుందని తెలుసు. కానీ దాని గురించి అశ్రద్ధ ఎందుకు? ఇప్పుడున్న జన్మనే పూర్తిగా ఉపయోగించుకోవాలి.

పిల్లల కోసం, మనవల కోసం, వారి మీద మమకారంతో, సుఖాల కోసం, భోగాల కోసం ఎందుకు సమయాన్ని వృథా చేయాలి? ఇదే మా ఇద్దరి ఆలోచన. మొదట్లో ఎక్కడికైనా వెళ్తే, జూమ్ వేరే వారికి అప్పగించే వాళ్ళం. కానీ తర్వాత అనిపించింది ఈ సమయాన్ని నేను ఎందుకు వృథా చేయాలి? మనకు తెలిసిన జ్ఞానాన్ని మనం ఎందుకు పంచకూడదు? పత్రి గారు చెప్పారుగా "పంచింది పెంచబడుతుంది అని" అది ఎలా పెరుగుతుందో ఆలోచించండి? **"నువ్వు లోకానికి ఇస్తే, లోకేశుడు నీకు ఇస్తాడు".**

**"నువ్వు జ్ఞానం ఇతరులకు ఇస్తే నీ జ్ఞానం ఇంకా ఇంకా స్ఫురణకు వస్తూ పెరుగుతూ ఉంటుంది".** ఒక్కో విషయం లోతుగా చెప్పగలుగుతాము. ఇన్ని సంవత్సరాలు సందేశాలు ఇవ్వగలుగుతున్నామంటే ఇస్తున్నాము కాబట్టే వస్తోంది!

మరి మరొక్కసారి చెబుతున్నాను, కాలం చాలా విలువైనది, దాన్ని వృథా చేయకూడదు. గుర్తుపెట్టుకోండి మీరు కాలం తప్ప అన్నిటిని ఆదా చేస్తారు. ఇంట్లో వాడే సబ్బుని ఆదా చేస్తారు, పేస్ట్‌ని ఆదా చేస్తారు, అన్నిటిని ఆదా చేస్తారు కానీ కాలాన్ని మాత్రం వృథా చేస్తారు! పనికి రాని మాటలతో, పనికి రాని పనులతో, పనికి రాని ఆలోచనలతో కాలాన్ని వృథాచేస్తారు. అవన్నీ ఇప్పుడు మీకు తెలియదు కానీ మరణించాక తెలుస్తుంది.

# “అంతరాత్మ నుంచి సహజంగా ఉబికేదే ధర్మం”

గత కొన్ని రోజులుగా మీరు చాలా ముఖ్యమైన విషయాలు తెలుసుకుంటున్నారు. ముఖ్యమైన విషయాలు అంటే మర్చిపోకూడనివి, ఎప్పుడూ గుర్తుంచుకోవాల్సినవి, ముఖ్యంగా ఆచరించవలసినవి. అవి మీ సహజ స్వభావంగా మారాలి. అప్పుడు మాత్రమే మీరు అద్భుతమైన జ్ఞాన సంపన్నులు కాగలుగుతారు.

ఇప్పుడు ఇంకొక ముఖ్యమైన సందేశం గురించి తెలుసుకుందాం.
**“అంతరాత్మ నుంచి సహజంగా ఉబికేదే ధర్మం, ఎవరినైనా రక్షించేదే ధర్మం.”**

ఇప్పుడు దీని గురించి కొంచెం వివరంగా తెలుసుకుందాం. సహజంగా మీరు “ధర్మం” గురించి చాలా సార్లు మాట్లాడుతుంటారు.

కానీ అసలు ధర్మం అంటే ఏమిటి? అంటే ఈ సృష్టిని సృష్టించినప్పుడు, సృష్టికర్త ఈ సృష్టి సాఫీగా నడవడానికి కొన్ని నియమాలు, కొన్ని సిద్ధాంతాలు ఏర్పాటు చేశాడు. ఆ నియమాలనే ధర్మాలు అంటాం.

ఎందుకంటే ఆయన ఎన్నో లోకాలను, ఎన్నో జీవులను సృష్టించాడు. సుమారు 84 లక్షల జీవరాశులు ఉన్నాయని కూడా చెబుతారు. ఇవన్నీ సజావుగా నడవడానికి ఈ ధర్మాలు, సిద్ధాంతాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ ధర్మాలను ఎవరు ఉల్లంఘించినా, సృష్టి నియమాల ప్రకారం వారు శిక్షింపబడతారు. భగవంతుని శిక్షలు ఎలా ఉంటాయి అంటే మానవులకు వచ్చే కష్టాలే ఆ శిక్షలు. అందువల్ల, మీకు కష్టాలు రాకూడదంటే, శిక్షలు పడకూడదంటే, సృష్టి నియమాల ప్రకారం జీవించాలి. అంటే ధర్మం ప్రకారం జీవించాలి.

అందుకే ఉపనిషత్తులో ఒక గొప్ప వాక్యం ఉంది. “ధర్మో రక్షతి రక్షిత:” అంటే, ధర్మాన్ని రక్షిస్తే అది మిమ్మల్ని రక్షిస్తుంది.

ఇది ఎంత గొప్ప సత్యమో గమనించండి. లోకంలో మానవులంతా రక్షింపబడటానికి ఎవరికి నచ్చిన దైవాన్ని వాళ్ళు ఆశ్రయిస్తూ ఉంటారు.

ఎందుకంటే  కష్టాల నుంచి, సమస్యల నుంచి, బాధల నుంచి బయటపడాలని కోరుకుంటారు.

అందుకే వారు తమకు నచ్చిన దేవుణ్ణి ప్రార్థిస్తారు "నన్ను ఈ కష్టాల నుంచి రక్షించు" అని. కానీ అసలు సత్యం ఏమిటంటే మిమ్మల్ని రక్షించేది దైవం కాదు, మీ ధర్మమే.

ఇది మీరు ప్రతిరోజూ గమనిస్తున్న విషయమే. ముఖ్యంగా తిరుపతి తిరుమలలో లక్షలాది మంది భక్తులు ప్రతిరోజూ వెళ్తున్నారు. ఎందుకు అంటే ఆ దైవాన్ని ప్రార్థించి, తమ కష్టాల నుంచి రక్షించమని అడగడానికి.

కానీ ఒక గొప్ప సత్యం ఏమిటంటే ఆ వెంకటేశ్వర స్వామి తిరుమల వెళ్ళకుండానే వారి మనసులోని కోరికను తెలుసుకుని, ముందుగానే **"ధర్మో రక్షతి రక్షితః" అంటే మీరు ధర్మాన్ని రక్షిస్తే, అది మిమ్మల్ని రక్షిస్తుంది"** అనే సందేశాన్ని ఇచ్చినట్టుగా పెద్ద బ్యానరు ఏర్పాటుచేసి ఉంటుంది.

"మీరు నన్ను రక్షించమని కోరడానికి వస్తున్నారు. కానీ మిమ్మల్ని రక్షించేది నేను కాదు మీ ధర్మమే" అని వెంకటేశ్వరస్వామి సందేశం. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నవాడు దైవాన్ని కాకుండా ధర్మాన్ని ఆశ్రయిస్తాడు. కాస్త బుద్ధి  ఉన్నవాడు, ఈ విషయం లోతుగా గ్రహించగలుగుతాడు.

దేవుడే నేరుగా రక్షించేవాడైతే, వేదాలలో **"ధర్మో రక్షతి రక్షితః"** అనే వాక్యం ఎందుకు ఇవ్వబడింది? అందువల్ల ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే జీవితం బాగుండాలి అంటే ధర్మాన్ని రక్షించాలి, ధర్మాన్ని పాటించాలి. ఏ దైవము కూడా ఎవరినీ రక్షించదు. ఎందుకంటే మీరు రక్షించమని కోరే ఆ దైవం ఎవరో కాదు మీరే. పత్రి గారు **"అహంబ్రహ్మాస్మి"** అంటే మనమే దేవుళ్ళం అని చెప్పారు.

అందుచేత, మీరు రక్షింపబడాలి అంటే ముందుగా చేయవలసిన పని ధర్మాన్ని రక్షించడం. మీరు ధర్మాన్ని ఉల్లంఘిస్తే, ఎవరూ మిమ్మల్ని ఆదుకోలేరు, రక్షించలేరు.

ఈ సత్యం యుగాలుగా మనకు తెలిసినదే. ద్వాపర యుగంలో కౌరవులు, పాండవులు ఉన్నారు. పాండవులు ధర్మం వైపు ఉన్నారు, కౌరవులు అధర్మం వైపు ఉన్నారు. కానీ దైవం ధర్మం వైపే నిలిచింది. అందుచేత, అధర్మం తాత్కాలికంగా జయించినట్టుగా కనిపించినా, చివరకు ధర్మమే జయిస్తుంది.

ఇది అర్థమయ్యేలా ఒక చిన్న ఉదాహరణ చెప్తాను. ఒకసారి కద్తాల్లో నేను క్లాస్ చెబుతుండగా, ఒక వ్యక్తి ఒక చిన్న మామిడి కాయ తీసుకొచ్చి నాకు ఇచ్చాడు. అది ఎక్కడి నుంచి తెచ్చాడో అని అనుమానం వచ్చింది. "నువ్వు ఎవరినైనా అనుమతి తీసుకుని తెచ్చావా?" అని అడిగాను. అతను సమాధానం చెప్పలేదు.

అప్పుడు నేను చెప్పాను, "ఇది ధర్మంగా తీసుకురాలేదు. అలా అయితే నేను దీన్ని ఎలా తింటాను?" అని చెప్పి ఆ మామిడి కాయను అతనికే తిరిగి ఇచ్చాను. ఎందుకంటే, ఒకరికి సంబంధించినది వారి అనుమతి లేకుండా తీసుకోవడం అధర్మం. ఇలాంటి పనులు చేస్తే, దాని ఫలితాన్ని మీరు కష్టాల రూపంలో అనుభవించాల్సిందే.

ఇలా మీరు ఎన్నో చిన్న చిన్న అధర్మాలు చేస్తూ ఉంటారు. అందుకే మీ జీవితంలో కష్టాలు వస్తుంటాయి. "కష్టాలు ఎందుకు వస్తున్నాయి?" అని మీరు అనుకుంటారు. కానీ అసలు కారణం మీకు ధర్మ సూక్ష్మాలు తెలియకపోవడం.

మీకు అనిపించినదే ధర్మం అనుకుంటారు. కానీ మీరు అనుకున్నది నిజమైన ధర్మం కాదు. సృష్టి నియమాల ప్రకారం ధర్మం ఏమిటో తెలుసుకోవాలి, దాని ప్రకారం జీవించాలి. అప్పుడు మాత్రమే మీరు జీవితంలో విజయం సాధించగలుగుతారు.

ఇప్పుడు మీకు ఒక సందేహం రావచ్చు "ఇంత గొప్పదైన ఈ ధర్మం గురించి మాకు ఎలా తెలుస్తుంది? ఎవరు చెప్పగలరని?" ఎందుకంటే చాలా మంది పెద్దలు, యోగులు, పండితులు ధర్మం గురించి చెబుతూ ఉంటారు.

కానీ సృష్టిలో ఉన్న సంపూర్ణ ధర్మాన్ని పూర్తిగా ఎవ్వరూ చెప్పలేరు.

అయితే, మీరు ధర్మాన్ని ఎలా తెలుసుకోవాలి? ఎలా ఆచరించాలి? ఈ సందేహానికి గురువుగారు స్పష్టమైన సమాధానం ఇచ్చారు. అదే **"అంతరాత్మ నుంచి సహజంగా ఉబికేదే ధర్మం"** అన్నారు.

అంతరాత్మ అంటే ఏమిటి? ప్రతి ఒక్కరి అంతరంలో ఉన్న ఆత్మ అదే భగవంతుడు, అదే పరబ్రహ్మ. మీరు "ఆత్మే పరబ్రహ్మ" అని తెలుసుకున్నారు. ఈ సృష్టిలోని అన్ని ధర్మ సూక్ష్మాలను ఏర్పాటు చేసిన వాడే ఆ పరబ్రహ్మ. సృష్టి చేసినప్పుడు ఈ నియమాలన్నీ ఆయనే ఏర్పాటు చేశాడు. కాబట్టి ఆయనకు తెలియనిది ఏదీ లేదు, ప్రతీదీ ఆయనకు తెలుసు.

అందుచేత, మీరు చేసే ప్రతి పని, మాట్లాడే ప్రతి మాట అది ధర్మమా? కాదా? తెలుసుకోవాలంటే, బయట ఎవ్వరిని అడగాల్సిన అవసరం లేదు. పెద్దల్ని, పండితుల్ని అడగాల్సిన పనిలేదు. మీ అంతరంలో ఉన్న ఆత్మను గమనిస్తే చాలు. మీరు చేయబోయే పని, మాట్లాడబోయే మాట అది ధర్మమా? కాదా? వెంటనే మీ అంతరాత్మ చెప్తుంది. కానీ, ఆ మాటను ఆచరించే ధైర్యం మీకు ఉండాలి.

ఇది అర్థం కావడానికి ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. ఒక వ్యక్తి అబద్ధం చెప్పబోతున్నాడు. అది తన ఇంట్లోనే భార్యతో గాని, ఎదుటివారిని మభ్యపెట్టడానికి గాని కావచ్చు. మీరు ఎక్కడికో వెళ్తున్నారు, మీ భార్య అడుగుతుంది "ఎక్కడికి వెళ్తున్నారు?" అని. కానీ మీకు నిజం చెప్పాలని అనిపించదు. అప్పుడు మీలో ఒక సంఘర్షణ మొదలవుతుంది. నిజం చెప్పాలా? లేక అబద్ధం చెప్పాలా? నిజం చెబితే గొడవ వచ్చే అవకాశం ఉంటుంది. అబద్ధం చెబితే తప్పించుకోవచ్చు. కానీ అంతరాత్మ మాత్రం వెంటనే చెప్తుంది "ఇది తప్పు" అని.

ఇక్కడే మీకు పరీక్ష. మీరు అంతరాత్మ మాట వింటారా? లేక దాన్ని ప్రక్కన పెడతారా? చాలా సార్లు మీరు అబద్ధాన్ని ఎంచుకుంటారు, ఆ సమస్య

నుండి తప్పించుకుంటారు. కానీ మీ లోపల ఒక అసహనం మొదలవుతుంది. ఇదే అంతరాత్మను వినకపోవడం వల్ల వచ్చే బాధ. కొన్ని సందర్భాల్లో మీరు ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవాలని చూస్తారు. వెళ్ళేది ఒక చోటికి, చెప్పేది ఇంకోటి. ఇలాగే చిన్న విషయాల్లోనే ధర్మాన్ని తప్పుతుంటారు.

అంతరాత్మ ముందుగానే హెచ్చరిస్తుంది. "ఇది తప్పు" అని చెప్తుంది. కానీ మీరు వినకుండా పోతే, ఆ తప్పు అంటే పాపం మీ ఖాతాలో చేరుతుంది. దాని ఫలితంగా వచ్చే కష్టాన్ని తప్పకుండా మీరు అనుభవించాల్సిందే.

ఇలాంటి ఉదాహరణలు మీరు కుటుంబాల్లో తరచూ చూస్తుంటారు. భార్యాభర్తల మధ్య గొడవ జరిగినప్పుడు, భర్త "ఇంకెప్పుడూ ఇలా చేయను" అని హామీ ఇస్తాడు. అప్పుడు పరిస్థితి కాస్త సర్దుకుంటుంది. కానీ ఆ హామీ ఎక్కువ కాలం నిలవదు. కొద్దిసేపట్లోనే మళ్లీ మామూలు ప్రవర్తన మొదలవుతుంది.

ఇక్కడ కూడా అదే జరుగుతుంది మాట ఒకటి, ఆచరణ ఇంకొకటి. చాలామంది "నేను ఎక్కడ తప్పు చేశాను?" అని అనుకుంటారు. కానీ రోజు రోజుకు ఎన్నో చిన్న చిన్న అధర్మాలు మీ ఖాతాలో చేరుతున్నాయి అన్న విషయం గుర్తించరు. మరి భార్య కూడా చాలా సార్లు నిజాన్ని దాచిపెట్టి, మాయగా విషయాలను కప్పిపుచ్చుకుంటుంది. భర్త అడిగితే ఒకటి చెప్పాల్సింది, ఇంకోటి చెబుతుంది.

కానీ లోపల అంతరాత్మ మాత్రం నిజం చెప్తూనే ఉంటుంది "ఇది తప్పు" అని. అయినా కూడా మీరు వినకపోవడానికి కారణం? "ఇది బయటపడితే గొడవ వస్తుంది, సమస్య వస్తుంది" అనే భయం. అందుకే చిన్న అబద్ధం చెప్పి బయటపడాలని చూస్తారు.

కానీ ఒకసారి ఆలోచించండి చిన్న విషయాల్లోనే ధర్మాన్ని తప్పుతూ ఉంటే, పెద్ద విషయాల్లో మీరు ఎంత తప్పుతారో! ఇది కుటుంబ జీవితంలో మాత్రమే కాదు. వ్యాపారం చేసే వారు, ఉద్యోగాలు చేసే వారు, పదవుల్లో

ఉన్నవారు అందరూ రోజూ ఎన్నో సందర్భాల్లో ధర్మాన్ని తప్పుతున్నారు. అందుకే ఈ ప్రపంచంలో ఇన్ని సమస్యలు, ఇన్ని సంఘర్షణలు, ఇన్ని యుద్ధాలు జరుగుతున్నాయి.

మహాభారత యుద్ధం ఎందుకు జరిగింది? అధర్మం పరాకాష్టకు చేరుకుంది కాబట్టి, అందుకే యుద్ధం జరిగింది. ఇప్పటికీ ప్రపంచంలో యుద్ధాలు ఎందుకు జరుగుతున్నాయి? అధర్మం పెరగడం వల్లనే. అందుచేత, ఒక గొప్ప సత్యాన్ని గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరి అంతరంలో ఆత్మ రూపంలో భగవంతుడు, ఆ సృష్టికర్త మీ లోనే ఉన్నాడు. ఆయన ఎప్పటికప్పుడు మీకు ధర్మాన్ని బోధిస్తూనే ఉంటాడు. ఎందుకు? మిమ్మల్ని రక్షించడానికి. మీరు అడగకపోయినా, మిమ్మల్ని రక్షించాలనే ఉద్దేశంతో, మీ అంతరాత్మ ద్వారా ఆయన బోధిస్తూనే ఉంటాడు.

సహజంగా ధ్యానం చేయని వారికి, ఈ అంతరాత్మ ప్రబోధం అసలు అర్థం కాదు. అందుకే వారు దానిని పట్టించుకోరు, కొన్నిసార్లు విరుద్ధంగా ప్రవర్తిస్తారు. కానీ ధ్యానం చేసేవారికి, ముఖ్యంగా సరైన విధంగా ధ్యానం చేసే వారికి, ఇది చాలా స్పష్టంగా అర్థమవుతుంది. మీ అంతరంలో ఉన్న ఆత్మ ఎప్పటికప్పుడు మీకు ధర్మాన్ని బోధిస్తుంది. మీరు ఆ ధర్మాన్ని పాటించకపోతే, ఆత్మలో ఒక "ఘోష" ఒక అంతర్గత హెచ్చరిక వినిపిస్తుంది.


ధ్యానం చేయని వారికి ఈ ఘోష వినిపించదు. కానీ ధ్యానం చేసే వారికి అది స్పష్టంగా అర్థమవుతుంది. ఆ ఘోషను అర్థం చేసుకుని, దాన్ని పాటించే వారు నిజంగా అదృష్టవంతులు. ధర్మంగా జీవించడం సులభం కాదు, అది కష్టమే. కానీ ఆ కష్టాన్ని స్వీకరించి, ధర్మాన్ని ఆచరించడానికి ప్రయత్నిస్తే మీ జీవితాన్ని ధన్యం చేసుకున్నట్లే.

**"నాకు మోక్షం కావాలి, ఇక జన్మలు వద్దు"** అని అనుకుంటారు. కానీ ప్రశ్న ఏమిటంటే ధర్మాన్ని ఆచరించకుండా, అంతరాత్మ చెప్పింది వినకుండా, అది ఎలా సాధ్యం అవుతుంది? అందుచేత, మీరు ధర్మ యుక్తంగా

జీవించాలనుకుంటే, ప్రతి క్షణం మీలో ఉన్న ఆత్మను అనుసరించాలి, అది ఎప్పటికప్పుడు మీకు ధర్మాన్ని బోధిస్తూనే ఉంటుంది. మీరు పూర్తిగా దాన్ని అనుసరించగలిగితే, ఇది మీ ఆఖరి జన్మ అవుతుంది.

ఎవరినీ అడగాల్సిన అవసరం లేదు. మీ అంతరాన్ని గమనించండి. ప్రతి విషయంలో అది మిమ్మల్ని హెచ్చరిస్తూనే ఉంటుంది. మార్పు రావాలంటే, కేవలం నీతి వాక్యాలు, సూక్తులు వినడంతో సరిపోదు. మీ అంతరంలో ఉన్న ఆత్మ చెప్పే ధర్మాన్ని ఆచరించాలి. అప్పుడు మాత్రమే మీరు జీవితంలో కష్టాల నుంచి, నష్టాల నుంచి, బాధల నుంచి రక్షింపబడతారు.

ఎందుకంటే ధర్మాన్ని రక్షించినవారిని ధర్మమే రక్షిస్తుంది. ఇది నిజంగా అద్భుతమైన విషయం. అందుచేత, అంతరాత్మ ప్రబోధం ప్రకారం జీవించిన వాడు ధర్మాన్ని ఆచరించిన వాడు అవుతాడు.

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : **సింధూర, సెల్: 8555995217**

# “దానమే ధర్మము, ధర్మమే పుణ్యము, పుణ్యమే మోక్షము”

మనం గత కొన్ని రోజులుగా ముఖ్యమైన సందేశాల గురించి చర్చిస్తున్నాం. ఇవి సాధారణమైన విషయాలు కావు. మీ జీవితాన్ని మార్చగలిగే అమూల్యమైన సత్యాలు. ఈ విషయాలను మర్చిపోకుండా మరల మరల ఆలోచిస్తూ, వాటిని మీ జీవితంలో ఆచరించాలి. ఈ జ్ఞానం మస్తిష్కంలో గాఢంగా నిక్షిప్తం కావాలి. ఈ సత్యాలు మీకు పూర్తిగా అర్థమైతే, మీ ప్రవర్తనలో గొప్ప మార్పు వస్తుంది.

ఈరోజు సందేశాన్ని తెలుసుకుందాం.

**“దానమే ధర్మము, ధర్మమే పుణ్యము, పుణ్యమే మోక్షము”**

ఈ ఒక్క వాక్యంలోనే ఎంతో లోతైన అర్థం దాగి ఉంది. పత్రి గారు చెప్పే ప్రతి మాట సాధారణమైనది కాదు. ఆయన మాటల్లో ఎంత లోతు ఉంటుందంటే, మీరు ఎంతగా ఆలోచిస్తే అంతగా కొత్త అర్థాలు వస్తాయి.

చాలామంది పత్రి గారి గురించి ఒక అపోహలో ఉంటారు. ఆయన ఎక్కువసేపు మాట్లాడరని, కేవలం ఐదు లేదా పది నిమిషాలు మాత్రమే సందేశం ఇస్తారు అని అనుకుంటారు. కానీ, ఆయన చెప్పిన ఆ కొద్ది నిమిషాల మాటల్లోనే అపారమైన సందేశం ఉంటుంది.

**“దానమే ధర్మము, ధర్మమే పుణ్యము, పుణ్యమే మోక్షము.”** ఈ ప్రయాణం చివరకు మోక్షం దగ్గరకు వచ్చింది. మీ జీవితపు అంతిమ లక్ష్యం కూడా అదే మోక్షాన్ని సాధించడం. ఎవ్వరైనా సరే, ఏ మానవుడైనా సరే, చివరికి పొందవలసినది మోక్షమే.

పత్రి గారు ఈ మోక్షం పుణ్యం ద్వారా లభిస్తుంది అని చెప్పారు. అందుకే ఆయన “పుణ్యమే మోక్షము” అని స్పష్టంగా చెప్పారు. మోక్షం అంటే శాశ్వతమైన దుఃఖ రహిత స్థితి, శాశ్వత ఆనంద స్థితి, పూర్ణ జ్ఞానం పొందిన

స్థితి, జనన మరణాలకు అతీతమైన స్థితి, కర్మబంధాల నుంచి విముక్తి పొందిన స్థితి, పూర్ణాత్మగా ఎదిగిన స్థితి, సత్యలోకాన్ని చేరుకున్న స్థితి అని చెప్పుకున్నాం.

ఇలాంటి మోక్షం ఎలా లభిస్తుంది అనే విషయాన్ని కూడా పత్రి గారు వివరించారు. ఆయన చెప్పింది ఒక సులభమైన మార్గం అది "పుణ్యమే మోక్షము". ఈ పుణ్యం అంటే ఏమిటో తెలుసుకోవాలి, పుణ్యం ఎలా వస్తుందో కూడా తెలుసుకోవాలి, ఈ ప్రశ్నలకు సమాధానం కూడా పత్రి గారే ఇచ్చారు.

ఆయన **"ధర్మమే పుణ్యము"** అని చెప్పారు. అంటే పుణ్యం ధర్మం వల్లనే వస్తుంది. కాబట్టి ఇప్పుడు ధర్మం అంటే ఏమిటో మనం తెలుసుకోవాలి. ఆయన **"దానమే ధర్మము"** అని చెప్పారు. అంటే దానం వల్లనే ధర్మం వస్తుంది అని చెప్పారు.

ఇక్కడ పత్రి గారు జ్ఞానం గురించి మాట్లాడుతున్న సందర్భంలో ఈ విషయాన్ని చెప్పారు. అందువల్ల ఇప్పుడు ఈ విషయాన్ని ఒక్కొక్కటిగా లోతుగా అర్థం చేసుకుందాం. ముందుగా **"దానమే ధర్మము"** గురించి చెప్పుకుందాం.

ధర్మం ఎంత గొప్పదో ఒక్కసారి మనం ఆలోచించాలి. ధర్మానికి మించినది ఈ లోకంలో లేదు. అంత గొప్పదైన ధర్మం దానం ద్వారా లభిస్తుంది. ఇప్పుడు దానం అంటే ఏమిటో తెలుసుకుందాం. లోకంలో ఎన్నో రకాల దానాలు ఉన్నాయి.

కానీ నిజమైన దానం ఏమిటంటే? ఎలాంటి ప్రతిఫలం ఆశించ కుండా ఇచ్చేది. నువ్వు ఏదైనా ఇచ్చినా, దానికి ప్రతిఫలం ఆశించకపోతే, దానినే దానం అంటారు. ఈ లోకంలో దానాలు ఎన్నో రకాలున్నాయి. వందల రకాల దానాలు,  ఉన్నాయి. కానీ అన్నిటిలో గొప్పదైన దానం ఒకటే, అది **'జ్ఞాన దానం'**. జ్ఞానానికి మించినది లేదు. ఈ సృష్టిలో ప్రతి మనిషి చివరికి సంపాదించుకోవలసింది జ్ఞానం.

పత్రి గారు ఎన్నో విషయాలు చెప్పారు. ఆయన చెప్పిన విషయాల్లో గొప్పగా చెప్పిన విషయం జ్ఞానం గురించే. ఆ జ్ఞానం ధ్యానం ద్వారా లభిస్తుందని

కూడా చెప్పారు. జ్ఞానం యొక్క గొప్పతనాన్ని వశిష్ట మహర్షి యోగ వాశిష్ఠంలో వివరించారు. అలాగే, భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా జ్ఞానం గురించి బోధించాడు. వశిష్టులు వారు చెప్పినటువంటి ఒక్కొక్క విషయం మీద ఒక రోజు చెప్పుకున్నాం. జ్ఞానం మీద, జ్ఞానం యొక్క గొప్పతనం గురించి, జ్ఞాని యొక్క ప్రవర్తన ఎలా ఉంటుందో! ఇవన్నీ చెప్పుకున్నాం. జ్ఞానం యొక్క గొప్పతనాన్ని ఎన్నో కోణాల్లో వశిష్టుల వారు వివరించారు అంటే అది ఎంత గొప్పదో మనం అర్థం చేసుకోవచ్చు. అందుచేత జ్ఞానం కంటే గొప్పది ఏదీ లేదు. జ్ఞానం వల్ల దుఃఖం పోతుంది, జ్ఞానం వల్ల కర్మలన్నీ రహితమవుతాయి.

జ్ఞానం వల్లనే చివరికి మోక్షం లభిస్తుంది. జ్ఞానం వల్ల ప్రవర్తన పూర్తిగా మారి తుంది. సకల సద్గుణాలు కలుగుతాయి, దుర్గుణాలన్నీ పోతాయి. **"జ్ఞాని దుఃఖంలో కూడా ఆనందంగా ఉండగలడు",** ఇది చాలా గొప్ప స్థితి. ఈ సృష్టిలో ఉన్న మహానుభావులందరూ జ్ఞానులే. జ్ఞానం సంపాదించిన వాడే నిజంగా గొప్పవాడు అవుతాడు. అందుచేత, జ్ఞానాన్ని మించినది మరొకటి లేదు.

అలాంటి జ్ఞానాన్ని ప్రతిఫలం ఆశించకుండా, అందరికీ పంచడం అదే నిజమైన దానం. అందుకే పత్రి గారు18 ఆదర్శ సూత్రాల్లో జ్ఞానాన్ని, ధ్యానాన్ని పంచేటప్పుడు డబ్బు ఆశించకూడదని స్పష్టంగా చెప్పారు. పత్రి గారు ఎప్పుడూ ఎక్కడా ఫీజులు నిర్ణయించలేదు, ఎవరైనా స్వచ్ఛందంగా ఇస్తే మాత్రమే తీసుకునేవారు. కానీ ఎప్పుడూ ఎవరి దగ్గర డిమాండ్ చేయలేదు. ఇలా ఆయన జ్ఞాన యజ్ఞాలను నిర్వహించారు. అందువల్ల జ్ఞానాన్ని దానం చేయడమే నిజమైన ధర్మం.

ధర్మం ఎంతో గొప్పది. ఈ సృష్టి మొత్తం ధర్మంపై ఆధారపడి నడుస్తుంది.

ధర్మానికి మించినది ఈ సృష్టి నియమాల్లో లేదు. ధర్మాన్ని స్థాపించడానికి ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు అవతరించాడు. మహాభారత

యుద్ధం మొత్తం ధర్మం ఆధారంగా జరిగింది.  భగవంతుడు ఎల్లప్పుడూ ధర్మం పక్షాన ఉంటాడు. అధర్మం తాత్కాలికం – ధర్మం శాశ్వతం. ఈ సత్యాన్ని పాండవులు, కౌరవుల సంఘటనల ద్వారా ప్రపంచానికి తెలియజేశారు.

అందుచేత, జ్ఞానం అన్నింటికంటే గొప్పది. ఆ జ్ఞానాన్ని ప్రతిఫలం ఆశించకుండా పంచడమే దానం. అలాంటి జ్ఞాన దానమే సృష్టిలో అత్యున్నత మైన ధర్మం. పత్రి గారు ఎప్పుడూ “నువ్వు ఎంత తెలుసుకుంటే అంత పంచు” అని చెప్పేవారు. నువ్వు ఎప్పుడైతే జ్ఞానం పంచుతావో, అప్పుడు ఎదుటి వాడిలో జ్ఞానం వికసించడం ప్రారంభమవుతుంది. జ్ఞానాన్ని పంచడం కంటే గొప్ప ధర్మం మరొకటి లేదు, ఇలాంటి ధర్మాన్ని నువ్వు ఎంత ఎక్కువగా ఆచరిస్తే, అంత ఎక్కువగా నీకు పుణ్యం లభిస్తుంది” అని చెప్పేవారు.

ఇప్పుడు “ధర్మమే పుణ్యము” ఏది ధర్మం, జ్ఞాన దానమే ధర్మం. ఆ ధర్మం వల్లే పుణ్యం వస్తుంది. పుణ్యం అంటే అసలు అర్థం ఏమిటంటే “నీకు కలిగే లాభమే పుణ్యం”. అందులోనూ అత్యున్నతమైన లాభం ఏమిటంటే నువ్వు చేసే ధర్మం. ఏది ధర్మం అంటే, నువ్వు చేసే దానం ఏది అంటే, నువ్వు ఇచ్చే జ్ఞానమే. నువ్వు చేసే జ్ఞాన దానం ఒక గొప్ప ధర్మ కార్యం అవుతుంది, ఆ ధర్మ కార్యమే గొప్ప పుణ్యం అవుతుంది.

ఆ పుణ్యాన్ని నువ్వు ఎంత ఎక్కువగా సంపాదిస్తే, అది చివరికి నిన్ను మోక్షానికి చేర్చుతుంది. అందుచేత మీరు చేయాల్సింది ఒక్కటే, జ్ఞానం సంపాదించాలి,ఆ జ్ఞానాన్ని ప్రతిఫలం ఆశించకుండా పంచాలి.

మీరు పొందిన జ్ఞానాన్ని పంచండి. ఈ లోకంలో దీనికంటే గొప్ప పని మరొకటి లేదు. మీరు భూమిపై చేయవలసిన గొప్ప కర్తవ్యం ఇదే, ఇదే మిమ్మల్ని మోక్షానికి చేర్చుతుంది. నేను ఎంతో అధ్యయనం చేశాను, ఎంతో ఆలోచించాను చివరికి అర్థమైంది పత్రి గారు ఎంత గొప్ప స్థాయికి ఎదిగారో, అది ఆయన సంపాదించిన జ్ఞానం వల్ల, ఆ జ్ఞానాన్ని నిరంతరం పంచడం వల్ల. ఎందుకు ఆయనకు అంతటి ఆదరణ, అంతటి ఆకర్షణ కలిగిందో

ఒకసారి ఆలోచించాలి. దానికి కారణం చాలా స్పష్టంగా ఉంది, ఆయన జ్ఞానాన్ని పంచారు, ఆయన ధ్యానాన్ని పంచారు.

"సరైన జ్ఞానం, సత్య జ్ఞానం" ఇదే విషయాన్ని నేను మీకు చెబుతున్నాను. మీరు కూడా దీనిని ఆచరించాలని చెబుతున్నాను. ఈ లోకంలో మీరు ఎన్ని కోట్లు సంపాదించినా, ఎంత గొప్ప స్థాయికి ఎదిగినా, ఎంత సుఖంగా జీవించినా ఈ మార్గానికి మించినది మరొకటి లేదు.

మీరు ఇలాంటి గొప్ప మార్గంలోకి వచ్చినందుకు, మీరు ఎంతో అదృష్టవంతులు. అందుకే మిమ్మల్ని "డైమండ్స్" అని పిలుస్తాను. ఇది మీకు ఇప్పుడే పూర్తిగా అర్థం కాకపోవచ్చు. కానీ మీరు ఈ మార్గాన్ని ఎంతగా ఆచరిస్తారో! ఈ శరీరాన్ని విడిచిన తరువాత ఈ మార్గం యొక్క అసలు గొప్పతనం మీకు స్పష్టంగా తెలుస్తుంది.

మీరు ఎంతో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలంటే అది జ్ఞానం ద్వారానే సాధ్యమవుతుంది. అందువల్ల ఈ విషయాన్ని ఎప్పటికీ మర్చిపోవద్దు. పత్రి గారు చెప్పిన **"దానమే ధర్మము, ధర్మమే పుణ్యము, పుణ్యమే మోక్షము"** ఈ మూడు పదాల్లో ఉన్న లోతు అపారమైనది. పత్రి గారి ద్వారా మనం ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకున్నాం, ఎన్నో గొప్ప విషయాలను తెలుసుకున్నాం.

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|



మరచిపోకూడని, అనుక్షణం గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన సందేశాలు ఇవి. వీటిని మీరు ఎప్పుడూ గుర్తుంచుకుంటే, మీ జీవితంలో ఎంతో మార్పు వస్తుంది. మీరు తప్పులు చేయరు, ఏం జరిగినా దుఃఖించరు. సాధించలేనివి కూడా సాధిస్తారు, ఊహించని మార్పులు మీలో వస్తాయి, పత్రి గారు ఎన్నో చెప్పారు, పెద్దలు కూడా ఎన్నో చెప్పారు. వాటిలో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

- "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి"
- "మీరు చేసే ప్రతి పని ప్రకృతి గమనిస్తుంది"
- "ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు"
- "నీరు పల్లమెరుగు, సత్యము వ్యాప్తి నెరుగు"
- "కోట్లు ఉన్నవాడు ధనవంతుడు కాదు, తృప్తి ఉన్నవాడే ధనవంతుడు"
- అందరిని ఇష్టపడే వాడే అందరికీ ఇష్టుడు అవుతాడు
- "కాలం చాలా విలువైనది, కాలాన్ని ఎప్పుడూ వృథా చేయకూడదు."
- "అంతరాత్మ నుంచి సహజంగా ఉబికేదే ధర్మం"
- "దానమే ధర్మము, ధర్మమే పుణ్యము, పుణ్యమే మోక్షము"

- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు

రూ.80/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| **Telugu Books** | **English Books** | **Hindi Books** | **Kannada Books** | **Tamil Books** |